

# అరుణోదయం

**కొడవటిగంటి కుటుంబరావు**

రామ్మూర్తి ఎక్కడా తప్పకుండా బియ్యే పాసయినాడు. అన్ని పరీక్షల్లోనూ ఫస్టుమార్కులే.

చదువై పోతూనే రామ్మూర్తి భార్య కాపరానికొచ్చింది. తల్లిదండ్రు లిద్దరూ చచ్చి పోయినారు. అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్ళూ ఎవరూ లేరు. ఇంవైఏంరాం సుక్షేత్ర

మైన మాగాణీ ఉంది. ఇల్లుంది. రామ్మూర్తి భార్యతో స్వర్గసుఖం అనుభవిం సాగాడు.

పరీక్షల్లో ఫస్టుమార్కు లొచ్చినా ఆడదాన్లో ఇంత ఆనందం వుందని రామ్మూర్తికి స్పష్టంగా తెలీదు. కామసుఖం గురించి బహిరంగంగా మాట్లాడేవాళ్ళంటే అతనికి భయంగానూ అసహ్యంగానూ ఉండేది.

నిజం చెప్పాల్సొస్తే రామ్మూర్తి స్తబ్ధు. అతని బుద్ధికి చైతన్యం తక్కువ. అతని ప్రపంచజ్ఞానం శూన్యం. అతనిలో కొంతయినా సంచలనం తెప్పించినమనిషి భార్యే కల్యాణి పెద్ద చైతన్యంగల మనిషనికాదు. ఆమె అతనికన్నకూడా స్తబ్ధు.

కల్యాణిలో కామోష్ణత లేకపోవటమూ, చూసే మగవాళ్ళనందర్నీ ఆకర్షించే లక్షణాలులేనిది కావటమూ రామ్మూర్తికి చాలా నచ్చింది. భార్యలు 'నిరపాయంగా ఉండటం భర్తల కెంతో హాయి.

రామ్మూర్తికూడా నిరపాయమైన మనిషే గనక అందరూ అతన్ని ఆదరించే వాళ్ళు. అతను ఒకరితో మాట్లాడడు. మతవిషయికంగా గాని, రాజకీయంగాగాని "కొత్త పద్ధతులు" కోరేవాడు కాడు.

ఉద్యోగం చెయ్యాలనే ఆలోచన రామ్మూర్తికి స్వతహాగా కలగనేలేదు. ఒకరికి పదిమంది, ఒకటికి పదిసార్లు, 'ఏమోయ్, పాపం, ఇంతపెద్ద చదువు చదివి ఊరికే ఉన్నావేం?' అని అడిగేసరికి, లోకదాసయిన రామ్మూర్తి లోకహితంగా ప్రవర్తించ లేక పోయినందుకు పశ్చాత్తాప పడసాగాడు.

ఉద్యోగాలు చేసేవాళ్ళంతా, ముష్టివాళ్ళల్లేనే, జాలిపడవలసిన వాళ్ళని రామ్మూర్తి దృఢవిశ్వాసం. ఉద్యోగం దొరికేవరకూ ఉద్యోగం ముష్టెత్తాలి. ఉద్యోగం దొరికిన తరవాత, పాపం, వాళ్ళకీ కూలివాళ్ళకీ తేడా లేదు. జీతంలోతప్ప.

తాను సమగ్రంగా జీవిస్తున్నట్టే రామ్మూర్తి భావించాడు. రోజల్లా తన యిష్టం వచ్చిన పని చెయ్యొచ్చు. పుస్తకాలు చదువుకోవచ్చు. భార్యతో సల్లాపా లాడవచ్చు. ఎవరైనా స్నేహితులువస్తే బాతాఖానీ కొట్టుకోవచ్చు. ఈ క్షణాన ఇక్కడుండాలని నియమం లేదు. ఈ పని చెయ్యాలనే నిర్బంధంలేదు. జీవితాని కింకేం కావాలి?

ఇట్లా ఉంటూ ఉండగా రామ్మూర్తి కారణాంతరాలచేత క్లబ్బులో చేరవలసి వచ్చింది. అతని స్నేహితులు చేరమని నిర్బంధించారు. రామ్మూర్తి క్లబ్బులో మెంబరుగా చేరి వెళ్ళసాగాడు.

ఇది నిజానికి చాలా మంచిపనే అయింది. క్లబ్బులో తనని అందరూ కొంచెం గొప్పగానే చూడసాగారు.

సీతారామయ్య ఒకనాడు నలుగురు పల్లెవాటు – గిరజాలవాళ్ళను క్లబ్బుకు పట్టు కొచ్చాడు. తీరా విచారిస్తే వారు సాహితీసమితివారని తేలింది. ఒకరు సమితి సభాపతి తల్లావఝుల శివశంకరశాస్త్రీ, మరొకరు దేవులపల్లి కృష్ణశాస్త్రీ, మరొకరు మునిమాణిక్యం నరసింహారావు, నాలుగో ఆయన వేదుల సత్యనారాయణ. అందరి పేర్లూ రామ్మూర్తి విన్నట్టే ఉన్నాయిగాని ఎవరెవరేం రాశారో అతనికి తెలీదు. రామ్మూర్తి ఎప్పుడయినా పత్రిక తిరగేసేవాడే. అతనికి పద్యా లెవరు రాసినా ఒకటిగానే ఉండేవి. కథలూ అవీ అసలు చదివేవాడుకాదు. బతికున్న రాతగాళ్ళకన్న పాతకవులే గొప్పవాళ్ళనే దృఢవిశ్వాసం తప్ప రామ్మూర్తికి సాహిత్యం గురించి స్పష్టమైన అభిప్రాయం లేదు. సుమతి శతకం పద్యాలైనాసరే పూర్వం అనేకసార్లు విన్న కవిత్వం బాగున్నట్టుండేది. కొత్త పద్యాలన్నీ గొడవగానే ఉండేవి. కాని అతని అదృష్టంవల్ల ఆనాడు దేవులపల్లివారు క్లబ్బులో కొన్ని సొంత పద్యాలూ ఇతర్ల పద్యాలూకూడా చదవటం జరిగింది. రామ్మూర్తికి ఆనందంతో ఉక్కిరిబిక్కిరయింది. ఆధునిక కవిత్వంలో ఇంత రసమూ జీవమూ ఉన్నాయని అతనికి తెలీదు. కవిత్వాన్ని ఆస్వాదించే 'విద్య' అతని కిన్నాళ్ళు లేకపోయింది. కృష్ణశాస్త్రి చదివిన పద్యాలిప్పుడు తన తలలో జోరీగలల్లే చేరి ఆలోచన తోచనివ్వటం లేదు... ఏ ననంత శోకభీకర తిమిర లోకైకపతిని...శోకభీకర తిమిర... కంటక కరీటధారినై కాళరాత్రి... ఇటువంటి తుంపులు అతని మనస్సులో చేపలు ఈదినట్టు ఈదసాగినై.

రామ్మూర్తి తను ఇంతకాలమూ సమగ్రంగా జీవించటంలేదని తేల్చుకున్నాడు. కవిత్వం! తన జీవితంలో కవిత్వం లోపించింది. పాతకవిత్వం చెత్త. దానికి రెక్కలులేవు... ఉప్పు కప్పురంబు ఒక్కపోలికనుండు... ఛీ ఛీ! వొట్టి వచనం; వొట్టి దుమ్ము! భావం మెరుపల్లే మెరవాలి, చలించాలి!

కవిత్వం రాయాలనే ఆలోచన వెంటనే రామ్మూర్తికి రాలేదుగాని కవిత్వంలో ఓలలాడుదామనే కాంక్ష అప్పటికప్పుడే అతనిలో ఉద్భవించింది.

* * *

ఇప్పుడు రామ్మూర్తికి జీవితం కొంతవరకు కరతలామలక మయింది. అతని ఇల్లు కవులకూ, నటకులకూ తదితర కళాకారులకూ రహదారి కావటంచూసి ప్రజలు వెనకటి మోస్తరుగా చీటికీ మాటికీ, "ఏదో ఒకటి చెయ్యరాదా?" అని అడగటం తగ్గించారు

తాను రచయితల జాబితాలో కెక్కటానికి రామ్మూర్తి చేసిన ప్రయత్నా లంత

సఫలం కాలేదనే చెప్పాలి. ముఖ్యంగా అతను కవిత్వంరాయాలని పడ్డ బాధ బొత్తిగా వృధా అయిపోయింది. రామ్మూర్తి రాసిన వృత్తాలుచూసి సాటి కవులుకూడా, సహృదయులు సహితం, అంతబాగా కుదరలేదనే అనవలసి వచ్చింది. గీతాలురాసి చూడమన్నారు కొందరు. ముత్యాల సరాలయితే ఇంకా బాగుంటుందేమోనని కొంద రభిప్రాయ పడ్డారు.

ఇవి రాయటానికి రామ్మూర్తి చేసిన కృషి వర్ణనాతీతం. ఎన్నోవందల గీతాలూ, డజన్లకొద్దీ ముత్యాల సరాలూ కంఠస్థం చేశాడు. వాటినడకను రక్తంలో నెక్కించు కున్నాడు. వాటిధ్వని చెవులలో మోగించుకున్నాడు. ఎన్నో డజన్లు గీతాలూ, ముత్యాల సరాలూ రాశాడు కూడానూ. ఛందస్సూ, యతులూ, ప్రాసలూ అన్నీ దిగినై. కాని పద్యాలకి రెక్కలులేవు. ఉన్నసంగతి అనుకోక తప్పేదేముందిగనకా? రామ్మూర్తి ఆత్మ ఇతర కవుల రెక్కలమీద ఎగరవలసిందేగాని సొంత రెక్కలమీద ఎగరటానికి నోచుకోనట్టు కనపడది.

ఈ విధంగా కవిత్వంకోసం దాదాపు రెండు సంవత్సరాలు వృధా అయిపోయినై. మరో సందర్భంలో ఎవరో ఒకరు, ''నిజమైన కవితావేశం రావాలంటే అనేకకాల అనుభవా లుండాలి. జీవితపు కట్టుబాట్లను తెంచి స్వచ్ఛందంగా ప్రవర్తించినవాళ్ళే గొప్ప కవిత్వం రాశారు,'' అన్నారు. ఈ సత్యాన్ని నిరూపించటానికా పెద్దమనిషి ఇచ్చిన ఉదాహరణలు వింటున్నకొద్దీ రామ్మూర్తికి మతిపోయింది. అతను దేనికైనా సంసిద్ధుడేగాని సంఘ నియమా లుల్లంఘించటానికి మాత్రం సంసిద్ధుడుకాడు. అందు లోనూ ప్రత్యేకించి అతని జీవితానికి ధృవతార అయిన కల్యాణికి యత్కించిత్తు అన్యాయమూ చెయ్యటమనేది అతని కార్యక్రమంలో ఎక్కడా లేదు.

గడిచిన రెండు సంవత్సరాల కాలంలోనూ కళాస్పర్శ తగిలి రామ్మూర్తి మాన సిక జీవితం ఇంత పరివర్తనకు గురి అయినప్పటికీ అందులో పీఠంవేసుకున్న కల్యాణిలో మాత్రం అణుమాత్రం మార్పురాలేదు. ఆమె మానసిక రాజ్యంలో ఒక్క ఆకు కదలలేదు; ఆమె భావనా సముద్రంలో ఒక్కతరంగం పుట్టలేదు

ఈ సంగతి రామ్మూర్తి గ్రహించక పోలేదు. కాని అతనికి భార్యమీద అను రాగం తగ్గటానికి బదులు హెచ్చింది. ఇల్లువదిలి దూరం వెళ్ళుతున్నవాడికి ఇంటి మీద మమకారం హెచ్చినట్టుగా రామ్మూర్తికి తనభార్యయొక్క నిశ్చలత్వం మరింత ఆకర్షవంతంగా కనిపించింది. అదీకాక ఆమె అతని ఉత్సాహాన్ని భంగపరచలేదు.

వ్యసనాల్లోకి దిగకుండా తనకు కవిత్వం అబ్బని పక్షంలో కవిత్వం వద్దని తీర్మానించుకున్నాడు రామ్మూర్తి. ఈ సూత్రం నిజమవునో కాదో అతనికి తెలీదుగాని



ఇది విన్నప్పటినుంచీ అతనికి కవిత్వం రాయటంలో బొత్తిగా ఆసక్తి పోయింది. కాని ఇప్పటికీ కవిత్వం చదివే ఆసక్తి మటుకు దక్కింది.

ఈ దశలో అతను తలవని తలంపుగా ఒకకథ రాశాడు. ఈ కథ రామ్మూర్తి జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టమని చెప్పాలి. అది అట్టే గొప్ప కథకాదు. తానే రాసినప్పటికీ అది గొప్ప కథ అని రామ్మూర్తి కూడా అనుకోలేదు. అందులో ఉన్న కథాంశంలో నూతనత్వం ఏమీలేదు. ఒక ప్లీడరుగారు తన దగ్గరికి క్లయింటుగా వచ్చిన ఒక వేశ్య వలలో చిక్కుపడి ఆస్తి యావత్తూ పోగొట్టుకుని, చివరకు ఇంటి మొహంచూడని స్థితిలోఉంటే అతని పిల్లలిద్దరూ జబ్బుతో మంచానపడి వైద్యుణ్ణి తెచ్చేవాళ్ళుకూడా లేక చనిపోతాడు. ప్లీడరుగారికి వేశ్యలను గురించీ, వేశ్యావృత్తిని గురించీ జ్ఞానం కలిగి, పశ్చాత్తప్తుడై భార్య దగ్గరికివచ్చి యథాప్రకారం కాలక్షేపం చేస్తాడు. అదీ కథ.

ఈ కథలో నూతనత్వం ఏమీలేదు కనకనూ, రచనాశిల్పంలోకూడా ప్రత్యేకత ఏమీలేదు కనకనూ గొప్పకథ కాదనుకోవటంలో రామ్మూర్తి సామాన్య విమర్శకులు పడే పొరపాటే పడ్డాడు.

మరో అయిదారు సంవత్సరాలలో అతను ప్రఖ్యాత కథకుడవుతాడని అతను అప్పట్లో ఏ మాత్రమూ భావించలేరు. "పరిణామం" అని పేరు పెట్టిన ఈ కథ రాసి అతను ఆరునెల్లు పైగా దగ్గర ఉంచుకున్నాడు. అది అచ్చులో పడకమునుపే దాన్ని ఇరవైమంది రచయితలూ, మరో నలభైమంది తదితరులూ విన్నారు. ఎన్నడూ రాయనివాడు ఒక కథ రాశాడంటే దానికి "న్యూస్ వాల్యూ" ఉంది. అది ఒక ప్రత్యేక వార్తకింద వ్యాప్తమవుతుంది. ''పరిణామం'' అనే అముద్రిత కథ ఒకటి రామ్మూర్తి దగ్గర ఉన్నదనే వార్త కొంతదూరం ప్రయాణం చేసింది. దాన్ని గురించి పుకార్లుకూడా బయలుదేరినై. అతను దాన్ని పెంచి నవలగా రాస్తున్నాడని ఒక పుకారూ, దాన్ని ఎంతమంది పత్రికలవాళ్ళడిగినా ఇవ్వలేదనే మరో పుకారూ విచ్చలవిడిగా ప్రజలలో వ్యాప్తమయినై. ఆఖరుకు దాన్ని ఎవరో పత్రికవారు అడిగి తెప్పించుకుని ప్రచురించారు. మామూలుగా ప్రచురితమైతే చదివి ఉండని అనేకమంది దాన్ని ఆసక్తితో చదివారు.

ఆరు నెలలు గడిచినై. రామ్మూర్తి మరో కథ రాస్తున్నాడని పుకారు పుట్టింది. రామ్మూర్తి స్నేహితులు ఈ రెండో కథకోసం ఎదురు చూస్తున్నట్టు నలుగురికీ కనిపించసాగారు. కాని ఈ రెండో కథ మరో నాలుగు నెలలవరకూ బయటికి రానేలేదు. దీనిపేరు ''ప్రాయశ్చిత్తం''. "ప్రాయశ్చిత్తానికీ", "పరిణామానికీ" కొంతవరకు ఏకమేధో జనితమైనందుకు పోలికలున్నా పరిశీలనాపరులకు తేడాలు కనిపించకపోలేదు.

"ప్రాయశ్చిత్తం"లో నాయకుడు డాక్టరు. అతని దగ్గరకు ఒక రోగి వస్తాడు. అతని భార్య జారిణి. డాక్టరును – అన్యసతీ విముఖుణ్ణి – ఆవిడ వలలో వేసుకుంటుంది. కానీ ఇవ్వకుండా భర్తకు వైద్యం చేయించుకుంటుంది. తన దారిన తాను పోతుంది. ఆవిడ పబ్బం గడుపుకుపోయిందని తెలుసుకోక ఆమె ప్రేమచేత దహించుకుపోయినవాడై మన డక్టరు అహర్నిశలు కృంగి కృశించిపోతాడు. ప్రాక్టీసు చెయ్యలేకపోతాడు. ఒక రోగికి ఇంజెక్షన్ నివ్వవలసి వస్తుంది. డాక్టరు చెయ్యి వొణుకుతుంది. రోగిప్రాణాని కెంత కావాలి? ఇంజక్షను సరిగా ఇవ్వని కారణాన రోగి చచ్చిపోతాడు. డాక్టరు లైసెన్సు పోతుంది. బికారి అయిపోతాడు. అతన్ని ఈ గతికి తెచ్చిన కులట డాక్టరు స్థితి తెలుసుకుని పశ్చాత్తాప పడి, తాను పతితురాలననిన్నీ, ఇటువంటివారిని చూసి మోసపోవద్దనీ అతనికి జాబు వ్రాసి తాను బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంటుంది. డాక్టరు జ్ఞానోదయం కలిగినవాడై తిరిగి భార్యతో సుఖంగా సంసారం చేసుకుంటూ యథాప్రకారం వైద్యం చేయసాగుతాడు.

అతని జీవితాన్ని బహు శ్రద్ధగా పరిశీలిస్తూ ఉండిన వైద్యాధికారులు అతనిలో కలిగిన "పరిణామానికి" సంతసించి అతని లైసెన్సు అతనికి తిరిగి ఇస్తారు. ఈ లైసెన్సును డాక్టరుగారి భార్య తన స్వకీయ కరకమలాలతో డాక్టరుకు అందిస్తుందనీ, వొణుకుతున్న చేతులతో, అశ్రుపూరిత నేత్రాలతో, గద్గద కంఠంతో అతను దాన్ని అందుకుంటాడనీ పాఠకులకు వేరే చెప్ప నవసరంలేదు.

"పరిణామం" బాగుందన్నవాళ్లు "ప్రాయశ్చిత్తం" ఇంకా బాగుందన్నారు. జరిగిన సంవత్సరం కాలంలోనూ రామ్మూర్తి శిల్పపటిమ బాగా హెచ్చినట్టు భావుకులు భావించారు. అతనికి కథా రచయితల పట్టీలో అనల్పమైన స్థానం ఏర్పడ్డట్టు సహృదయులు సవిశ్వాసంగా చెప్పారు.

రామ్మూర్తి రాసిన మూడో కథను గురించి వివరాలివ్వటానికి ఈ రచయితకు చెయ్యి రాకుండా ఉంది. ఈ ఘట్టాన్ని దాచి పెట్టటం, లేక మరుగుపరచటం, ఒక విధంగా న్యాయసమ్మతమైనదే. కాని ప్రసిద్ధ పురుషులు చేసే లోపాలలోకూడా మనబోటివాళ్ళు నేర్చుకోదగిన నీతి ఉంటుంది. ఈ ధైర్యంతోనే ఈ విషయం బహిర్గతం చెయ్యటమయింది.

ఈ మూడో కథ పేరు – పాపం శమించుగాక! – "జంట కోయిలలు". ఇందులో ఇద్దరే పాత్రలు, నాయికా నాయకులు. నాయకుడు కవి, గీతా లాలపిస్తాడు. నాయిక అతని భార్య; ముగ్ధ; అభమూ, శుభమూ ఎరగని అమాయకురాలు ఆమెను కవి గగన వీధులన్నీ తిప్పుతాడు. ఆమెలో ఆవేశం వొస్తుంది. ఆమెకూడా తియ్యగా గీతాలాలపించటం మొదలుపెడుతుంది. అంతే కథ.

రెండోకథ వెలువడిన నాలుగు నెల్ల కాలంలోనే ఇది వెలువడింది. నిశితవిమర్శకులు దీన్ని, "కథకాదు, కథాచ్యుతి" అన్నారు. సానుభూతి రహితులు ఇందులో చాలా లోపాలు చూశారు. నాయికకూ రామ్మూర్తి భార్య అయిన కల్యాణికీ పోలికలు చూశారు. ఎంత కవికోకిల అయినా పరస్త్రీతో గానం చేయక స్వస్త్రీ సాంగత్యంలో గానం చెయ్యటం – మీదు మిక్కిలి ఆమెతో కంఠం కలిపి గానం చెయ్యటం – లోక విరుద్ధంగా ఉందన్నారు. కవి అయినవా డిట్లా ఎన్నటికీ రాసి ఉండడన్నారు.

రామ్మూర్తి తన తప్పు గ్రహించుకున్నాడు. అతని నాలుగో కథా, అయిదో కథా, ఆరో కథాకూడా అతని మొదటి రెండు కథల లాటివే. ఒక కథలో కాలేజీ లెక్చరరొకతను తన దగ్గర చదువుకునే విద్యార్థిని వలలో పడిపోతాడు. మరో కథలో ఒక ధనికుడు ఆస్పత్రిలో ఉండి ఒక నర్సు వలలో పడిపోతాడు. ఇంకో కథలో ఒక మునసబుగారు ఒక ప్లీడరుచెల్లెలు వలలో పడిపోతాడు. అన్ని కథల

లోనూ నాయకులు బుద్ధి తెచ్చుకుని భార్యల దగ్గరికి తిరిగివస్తారు. ఒక్క కాలేజీ లెక్చరరు మటుకు తన భార్యనే కోల్పోయి ఆమె ఫోటో ఎన్లార్జిమెంటుతో వాస ప్రస్థం ప్రారంభిస్తాడు. అతని పరివర్తనను ఆహ్లాదించేటందుకు విద్యార్థులు ఉపకరిస్తారు. ఈ కథలన్నీకూడా మొదటి రెండు కథలూ గడించినంత కీర్తి గడించినై. కథకుడుగా రామ్మూర్తి కీర్తి అసలుకు చేరే వడ్డీలాగా ప్రతి కథతోనూ హెచ్చిపోయింది.


రామ్మూర్తి ఏడో కథ రాయనేలేదు. ముఖ్యకారణం అతని ఆస్తి యావత్తూ అప్పులవాళ్ళ పాలయిపోయింది. అతను మట్టుకు ఇల్లుతోనూ పెళ్ళాంతోనూ మిగిలాడు. అది వేరే కథ.

* * *

ఇంతవరకూ మనం రామ్మూర్తి గృహ జీవితం జోలికిపోలేదు. అతనికి ఆర్థిక సమస్యలు లేనంతకాలమూ మనకా అవసరం లేకపోయినా ఇప్పుడతను ఆస్తంతా పోగొట్టుకున్నాడు గనక, ఇంత అన్యాయం కలగటానికి కారణ మేమిటని విచారణ చెయ్యటం అప్రస్తుతం కాదు.

రామ్మూర్తి ఆస్తి దాదాపు ఇరవై ఎకరాలుంది. పట్టాల ప్రకారం ఈ ఇరవై ఎకరాలు ఎక్కడో మారుమూల పల్లెటూళ్ళో ఉంది. ఆ భూమిని రామ్మూర్తి చూసిన పాపాన పోయి ఎరగడు. రామ్మూర్తి దగ్గరబంధు వొకాయన - వాళ్ళ స్వగ్రామం ఆ మారుమూల పల్లెటూరే - ఆ పొలం కవులుకివ్వటమూ, గింజలు కొలిపించుకోవటమూ, దాన్ని విక్రయించటమూ రామ్మూర్తి అవసరాన్నిబట్టి డబ్బిస్తూ వుండటమూ మొదలయినవి చేస్తూ వుండేవాడు. ఆయన రైతుల్ని ఒత్తిడిచేసి బోలెడంత గడ్డీ, జనుమూ, పెసలూ, మినుములూ, మిరపకాయలూ లంచం గుంజుతున్నాడనీ, పంట కళ్ళాల్లో మార్కెటు ధరకు ఓ రూపాయ తక్కువచేసి తనేకొని మంచి ధరకు విక్రయిస్తున్నాడనీ, మొత్తంమీద ఆయన యింటి ఖర్చంతా రామ్మూర్తి పొలంమీద రాబడితోనే గడిచిపోతున్నది గాని సొంత పొలంలోది ఒక్క గింజ ముట్టటం లేదనీ, తనకు పాడిబర్రెల దగ్గర్నించీ లంచాలు పెట్టే రైతులకే తక్కువ మక్తాకైనా కవులిస్తున్నాడనీ, తన సొంత పొలం కవులు రామ్మూర్తి పొలంకన్న ఎకరానికి రెండుబస్తా లెందు కెక్కువుందో గమనించమనీ కొందరు రామ్మూర్తి దగ్గరికి వచ్చి ఫిర్యాదులు చేసిపోయినారు.

రామ్మూర్తి సహజంగా డబ్బుజ్ఞానం ఎక్కువ కలవాడు కాదు. కాని ఆ దిక్కుమాలిన పల్లెటూరునుంచి ఏటా ఎవరో ఎరగని రైతులు వచ్చి, "మీరు కవులు




రాయించుకోండి, బాబూ. మీ యిష్టం వొచ్చిన కవులిస్తాం! ఆయనతో వేగలేకుండా వున్నాం. ఎంత పెట్టినా ఇంకా తే అంటే పిల్లలు గలాళ్ళం చచ్చిబోమా?" అని లబలబలాడుతుంటే కొంత ఆరాటం పుట్టినమాట నిజమే. ఆస్తి అంటూ వున్న తరువాత అది దోపిడి అవుతున్నదంటే ఎవరికైనా బాధగానే ఉంటుంది. అయితే పాపం, రామ్మూర్తికి తన బంధువును నిలబెట్టి "ఏమిటి ఇట్లా చేస్తున్నావుట?" అని అడిగే ధైర్యంలేదు. పొలం మేస్తున్నవాడంతో ఇంతో తినకుండా వొట్టి పుణ్యానికి చూస్తాడనటంకూడా ధర్మంకాదు. కాని ఎంత తింటున్నాడనేది తేల్చుకోవాలని రామ్మూర్తికి అభిలాష కలిగింది. ఇందుకోసం పనిపెట్టుకుని అక్కడికి వెళ్ళటానికి కాళ్ళాడలేదు.

అదృష్టవశాత్తూ ఏదో కోర్టులో సాక్ష్యం ఉండి ఆ బంధువే చక్కా వచ్చాడు. మాటల సందర్భంలో రామ్మూర్తి, "ఏం మామయ్యా! మన పొలానికింకా మక్తా ఎక్కువ ఇస్తామంటున్నారే!" అన్నాడు.

మామయ్య భోళాశంకరుడల్లే సగం పళ్ళూడిన నోటితో పొట్ట ఎగరేసుకుంటూ నవ్వి, "మాలవాళ్ళు నీ దగ్గర కొచ్చారటగా? విన్నాలే! వాళ్ళిస్తామనరుట్రా మరీ? ఇవ్వకపోలే కొరతవేస్తామా? వాడి కేమన్నా వెనక ఉండేడిస్తేగద? కళ్ళాలు నూర్చి పదిబస్తాలు చూపించి ఇంతే రాలినయ్యి బాబూ అంటే వాణ్ణేం చేస్తావురా?...

అప్పటికీ నేను ఏకసాలు కవులే ఇస్తున్నా, పోనీ వచ్చే ఏడన్నా మంచి రైతౌస్తా దేమో అని. ఎబ్బే! అసలు రైతు వొత్తిడి లేందే? వొట్టి పాపిష్టి ఊరు! ఈ బాధ పళ్ళేక నేను సొంతాన సహంపొలం చేస్తున్నా." అని ప్రారంభించాడు.

ఇక రామ్మూర్తి మాట్లాడలేదు. ఈ పొలం పని తనవంటి వాళ్ళకు కాదు. ఏదో ఏటా వెయ్యిరూపాయలదాకా వస్తున్నది. పైన వందా, రెండొందలూ కావాలంటే మామయ్యే అప్పిస్తున్నాడు. ఎందుకొచ్చిన ఆరాటం తనకు?

పొలంకు సంబంధించిన సమస్య లీ విధంగా పరిష్కారం కాగా అతనికి అప్పు బాధ కించిత్తు ఉంటూవచ్చింది. ఈ అప్పు ఏడెనిమిది వేలకు మించదు. తనబోటి ఆస్తిపరుడు కంగారు పడవలసిం దేమీలేదు. (మధ్య తరగతి భూస్వాముల్లో అప్పు లేనివాడెవడు? ఎవరుబడితే వాళ్ళన్నట్టు, ఎంత చెట్టు కంతగాలీ!) కాని ఇది తీరే ఉపాయం లేకపోవటం ఎప్పుడైనా ఒక్కసారి రామ్మూర్తిని కొద్దిగా బాధించేది.

ఈ ఏడెనిమిది వేల అప్పూ ఒక్కనాడు చేసినదికాదు. ఎన్నడో తన వివాహం అయినప్పుడు పదిహేను వొందల అప్పయింది. ఆట్టే వడ్డీకూడాలేదు. నూటికి నెలకు ఒకరూపాయి మాత్రమే. ఆ తరువాత బియ్యే చదువుకు మరో వెయ్యిరూపాయలు అప్పు చెయ్యవలసివచ్చింది. ఈ అప్పంతా తన "మామయ్య" ద్వారా వర్తకుల దగ్గర చేసినదే. అప్పు తాలూకు వడ్డీ అయినా తీరుస్తూ రావటానికి వీలు చిక్కలేదు. పొలంమీద వచ్చేది ఇంచుమించు ఇంటి ఖర్చుకు సరిపొయ్యేది. ఆ పాత అప్పంతా కలిసి రామ్మూర్తి కథా రచయిత అయేనాటికే ఏడెనిమిదివేల మధ్యకి దేకింది!

అంతకు పూర్వం రెండేళ్ళు ముందునుంచీ రామ్మూర్తి నిత్య ఖర్చుకోసం ఏటా నాలుగయిదు వందలు అదనంగా అప్పు చెయ్యటం ప్రారంభించాడు. ఏమీలేనివాళ్ళ కేదీ ఉండదు. నలుగురూ వస్తూపోతూవుంటే ఇంట ఖర్చుకేం లోటూ? అంతో ఇంతో పొలం అమ్మకుండా అప్పు తీరేటట్టు కనబడలేదు.

మరో నాలుగేళ్లు గడిచింది. 1930 పైనబడ్డది. ఆర్థిక కాటకం మీద పడ్డది. డబ్బు మాయమయింది. ధరలు చచ్చినై. అప్పుల వాళ్ళంతా ఏదోకాడికి పొలా లంటగట్టుకుంటున్నారు. పొలాలు కొనే నాధుడు లేడు. ఆఖరుకు ఎకరం ఎనిమిది వందలు చేసి షావుకార్లు పొలం అంటగట్టుకున్నారు.

సెంటు పొలం మిగలకపోయినా రామ్మూర్తి మటుకు కానీ అప్పు లేకుండా బయటపడ్డాడు. చేతికి రెండొందలు రొక్కంకూడా వచ్చింది.

ఈ పొలంపోయిన కొత్తలో రామ్మూర్తి ఇంత ఆపదా తనకే సంభవించినట్టూ



ఇన్నాళ్ళూ తనను కనిపెట్టి వున్న భగవంతుడికి అకస్మాత్తుగా తనమీద దయ తప్పినట్టూ భావించాడు. కాని ఎన్నో వేల మందికి తన గతే పట్టిందని తెలిసినప్పుడా బాధ కొంత ఉపశమించింది. ఈ ఆర్థిక ప్రళయం ఏ కారణంవల్ల కలిగిందో దాని వెనకవున్న పైశాచిక ఆర్థిక సూత్రాలేమిటో రామ్మూర్తి ఏమీ ఎరగడు. తాను స్వతంత్రజీవి ననుకున్నాడు. పదేళ్ళపాటు తన ఇష్టం వచ్చినట్టు జీవించానని నమ్మాడు. ఆ స్వాతంత్ర్యాన్ని ఇరవై ఎకరాల ఆస్తితో కొనుక్కున్న సంగతికూడా అతనికి స్పష్టంగా తెలియలేదు. ఇకముందు తాను వెనకటి మాదిరిగా కళాసేవ చేసే

అవకాశం ఉండదనీ, శాశ్వతంగా నాలుగు కాలాలపాటు నిలిచే సాహిత్యం రాయ లేననీ విచారించాడేగాని, తనలో సహం ఈడున్నవాళ్ళు వచ్చి తనకు జీవిత సత్యాలు చెబుతారనీ, తాను రాసిన ప్రఖ్యాత కథ లెవరికీ ఎందుకూ ఉపకరించవనీ అతనికి తెలీదు.

ముందు చూస్తే జీవితమంతా ఎడారిగా కనబడ్డది. ఉన్న ఇల్లు తప్ప అతని కే ఆధారమూ లేదు. ఇంతకాలమూ నిరసించిన ఉద్యోగం చెయ్యాలి. అదైనా ఎవ రిస్తారు? సొంతాన "ఏదన్నా" చేసుకుందామంటే "ఏదన్నా" చేసుకునే రోజులు కావు. మళ్లీ ఆ రోజులు తిరిగివచ్చే సూచనలైనా కనిపించలేదు.

చేతిలో మిగిలిన రెండుపందలూ అయిపోయినై. ఇంట్లోవున్న వెండిసామాను చాలా భాగం అయిపోయింది. భార్య వొంటిమీది బంగారంకూడా దాదాపు అయిపో యింది. రామ్మూర్తి తోచకలేదు. సంవత్సరం గడిచింది. ఎప్పటికైనా ఏదో జరిగి తీరుతుందనీ, తను ఎల్లకాలమూ ఈ స్థితిలో ఉండడనీ అతనికి తెలుసును.

ఇంతలో ఏదో జరగనే జరిగింది. ఒకనాటి ఉదయం తొమ్మిది గంటలకు ఒక స్నేహితుడు వచ్చి, "పట్నంలో నా స్నేహితు డొకాయన పత్రిక పెడతాట్ట. నువు దానికి సంపాదకుడుగా వెళతావా?" అని అడిగాడు.

రామ్మూర్తి తోచకలేదు. ఏమీ తొందర పడలేదు.

"పత్రికలు పెడతామన్నంత మాత్రంచేత లాభంలేదు. ఎవరా పెట్టేది? ఎంత డబ్బుతో పెడతారు? ఏమిటి కథ?" అన్నాడు. పొరపాటునకూడా అతను, "నా కేమిస్తారు?" అని అడగలేదు.

* * *

1930 నాటి ఆర్థిక కాటకంలోనుంచి అనేకం పుట్టినై. తెలుగువాళ్ళ సంస్కార జీవితంలో కలిగిన నూతన సృష్టిలో చెప్పుకోదగినవి పత్రికలూ, టాకీలూనూ.

ఒక పరిషత్తు తోడ్పాటులేకుండా, ఒక ఉద్యమం నడపకుండా దేశమంతటా రకరకాల పత్రికలు పుట్టి సాహిత్యాన్ని ప్రజలదగ్గరికి తెచ్చినై. వాటిలో వెలువడిన సాహిత్యం ఏతరగతి సాహిత్యమనేది ఎక్కువ ముఖ్యమైన విషయంకాదు. పత్రి కలు ఉత్తమ సాహిత్యంకోసం ఆందోళన చెయ్యలేదు. చేతికందిన కథలూ, వ్యాసాలూ ప్రచురించి జనసామాన్యంలో పఠితల్ని వేలసంఖ్యలో పెంచినై. సాహిత్యపిపాసా, సాహిత్యాభిలాషా కొత్తదారి తొక్కినై. ఒకప్పుడు తమకు సాహిత్యరచనగాని పఠనగానీ చేసేఅర్హత లేదనుకున్న తరగతులలోనుంచి రచయి తలూ పఠితలూ బయల్దేరారు. పత్రికా నిర్వాహకులుకూడా కొత్తరకంవారు ముందు

కొచ్చారు. మందులమ్ముకునేవాళ్ళూ, నగలవర్తకులూ పత్రికా నిర్వహణానికి పూనుకున్నారు. వారికి సాహిత్యాభిలాష లేదు. వాళ్ళకు ముఖ్యంగా కావలసింది తమ వస్తువులకు ప్రచారం జరగటం, రెండోది పత్రికలమీద లాభాలు తియ్యటం.

అయితే రామ్మూర్తిని మద్రాసు పిలిపించిన పెద్దమనిషి ఈ తరగతికి చెందిన వాడు కాడు. పత్రిక పెట్టడానికి ఆయన్ని పురిగొల్పింది సాహిత్యాభిలాషే. ఆయన చాలాకాలంగా పట్నంలో ఉండి గవర్నమెంటు నౌకరిచేసి విరమించాడు. డబ్బుకేమీ లోటులేదు. జార్జిటవును సందుల్లో ఒక ప్రెస్ అమ్మకానికొస్తే చవుకగా కొని దాని ద్వారా ఒక మాసపత్రిక నడపాలని ఆయనకి అభిలాష కలిగింది. దాన్ని నడపటానికి ఎవర్ని పెడితే బాగుంటుందని విచారించగా ఎవరో రామ్మూర్తి పేరు సూచించారు. ఇక మరో ఆలోచనచెయ్యక తననూ రామ్మూర్తినీ ఎరిగున్నవాళ్లున్నట్టు తెలుసుకుని వారిద్వారా రామ్మూర్తికి కబురుచేయించాడు. ముందు రామ్మూర్తి ఒకడే పట్నం వచ్చాడు. అన్నివిషయాలూ మాట్లాడుకున్నారు. పరదయ్యపంతులుగారు రామ్మూర్తికి నామకః నెలకు వంద జీతం ఇస్తానన్నాడు. ఒకప్పుడు రామ్మూర్తికి నూరురూపాయలేమూలా చాలేదికాదు. కాని కాటకం కావటంమూలాన అదే చాలా ఎక్కువగా కనపడింది.

పత్రికలో ఆధునిక కవుల పద్యాలూ, గేయాలూ, కథలూ, విమర్శక వ్యాసాలూ, కళాచర్చలూ, పుస్తక సమీక్షలూ మొదలైనవి ప్రచురించటానికి నిశ్చయించాడు రామ్మూర్తి. అడివివారు చక్కని ముఖచిత్రంవేసి ఇస్తామన్నారు. చింతా దీక్షితులూ, మునిమాణిక్యంవారూ, శ్రీనివాస శిరోమణీ, నోరివారూ ఇతరులూ కథలు రాస్తామన్నారు. విశ్వనాథవారూ, కొడాలివారూ, కొముండూరివారూ మొదలైనవారు పద్యాలు రాస్తామన్నారు. నండూరివారు యెంకిపాట ఒకటి పంపారు. పత్రిక వెలువడటానికి అన్ని సన్నాహాలూ జరుగుతున్నాయి.

ప్రెస్సున్నచోటే పత్రికకు ఒకగది చాలాభాగం ఖాళీచేసి ఇచ్చారు. ఒకమూల చెప్పులూ, బైండుగాని పుస్తకాలకట్టలూ, చెక్కలూ, పాతబడిన పైపులపోగూ ఉన్నప్పటికీ గది "కలావాణి" ఆఫీసుగా మారిపోయింది. రామ్మూర్తికి ప్రింటింగు గొడవ ఏమీతెలీదు. కాని ఆమాట అతను పైకి అనదలుచుకోలేదు. ఎవరికీ తెలియకుండా కాలక్రమాన నేర్చుకోవచ్చును.

రోజూ ఒకరిద్దరు సాహిత్యపిపాసువులు రామ్మూర్తి దర్శన పరిచయభాగ్యాలు పొంది, సాహిత్యచర్చచేసి, జేబులో పెట్టుకొచ్చిన వ్యాసాలు సమర్పించి వెళ

తున్నారు. ఈ సాహిత్య చర్చలలో సామాన్యంగా ఆధునికకవులప్రశంసే వస్తూండేది.

కాని ఒకనాడు రామ్మూర్తిదగ్గర కొక కుర్రాడొచ్చాడు. అతనికి ఇరవై ఏళ్ళకంటే ఉండవు. ఏదో మాటమీద మాటొచ్చి అతను భావకవిత్వం దక్కదన్నాడు. రామ్మూర్తికి ఆశ్చర్యంవేసింది. భావకవుల్ని తిట్టేవాళ్ళంతా యాభైపయి చిల్లర వాళ్ళనీ, వాళ్ళ నోళ్ళుకూడా క్రమంగా బలహీనం అయిపోతున్నయ్యనీ అనుకుంటూ వచ్చాడు రామ్మూర్తి. గుడ్డువచ్చి పిల్లను వెక్కిరించినట్టు ఈ ఇరవై ఏళ్ళ రాలుగాయి భావకవిత్వాన్ని విమర్శించటం రామ్మూర్తికి ఆశ్చర్యంవేసింది.

'నేటి కవులలో తెలుగుజాతియొక్క వాక్కున్నవాళ్ళు బహు కొద్దిమంది' అన్నాడు కుర్రాడు. 'గురజాడ అప్పారావుదగ్గర ఈ వాక్కు కనిపిస్తుంది, బసవరాజు అప్పారావుదగ్గర కనిపిస్తుంది. నండూరి సుబ్బారావులోకూడా కనిపిస్తుంది' అన్నాడు కుర్రవాడు.

ఉన్నకథకుల్ని గురించి రామ్మూర్తి కుర్రవాడి అభిప్రాయం అడిగాడు.

'జ్ఞాపకం ఉంచుకోదగిన కథలు రాసేవారెవరూ లేరు. ఒక్క గుడిపాటి వెంకటచలం కథలుమాత్రం చక్కని శిల్పంతో కూడుకుని ఉంటై. ఈశిల్పం పైనుంచి దిగుమతిచేసినదైనా అతివేగంగా తెలుగువాళ్ళ సొత్తయిపోతున్నది. కాలక్రమాన దేశంలో మిగిలేది చలంగారు తెచ్చిన శిల్పమే...ఆయన తెచ్చే కథావస్తువుకూడా దిగుమతి సరుకే. పాశ్చాత్య నాగరికతా వ్యామోహంతప్ప చలంగారికథల్లో ఏమీ కనిపించదు. స్త్రీపురుషులు స్వేచ్ఛగా విహరించాలనీ, సంఘంలోవున్న కట్టుబాట్లు యువకుల ఆనందాని కడ్డొస్తున్నాయనీ ఆయనకి విచారం. ఈ కట్టుబాట్లు ఎవరో కావాలని పెట్టినవైతే వాటిని తీసెయ్యటం సాధ్యమౌను. ఇవి ఎందుకొచ్చిందీ చలంగారికి తెలీదు. అందుచేత ఆయన వాటిని తన కథలద్వారా ఎప్పటికీ మార్చలేడు. చలంగారికి కావలసిన స్వేచ్ఛాయుతమైన సంఘం పాశ్చాత్యదేశాల్లో కాదుకదా, ఎక్కడా లేదు. వంటింటికీ వరాసాకీమధ్య గోడ కట్టుకుంటాం. స్నానాల గదయితే కిటికీలకి మరింత భద్రంగా తలుపులు పెట్టుకుంటాం. స్వేచ్ఛ కావాలని ఎవరమూ వెళ్ళి బట్టబయలులో నివసించం.'

"మీ కెటువంటి సాహిత్యం నచ్చుతుంది?" అని అడిగాడు రామ్మూర్తి నవ్వుతూ.

"నాకు నచ్చిన పాట 'మాకొద్దీ తెల్లదొరతనమూ' అనేది" అన్నాడా కుర్రాడు

"అది కవిత్వంకాదు. ప్రచారం," అన్నాడు రామ్మూర్తి.



"ఏ ప్రచారమూ చెయ్యలేకపోతే అది కవిత్వమేకాదు," అని జవాబిచ్చాడు కుర్రాడు.

కృష్ణశాస్త్రి కృష్ణపక్షంకంటె మాకొద్దీ తెల్లదొరతనం మంచి కవిత్వం అనటం ఎట్లా? కుర్రాడు మొండివాదన చేస్తున్నట్లు తోచింది రామ్మూర్తికి.

"కవితాశిల్పం మాటేమిటి?" అన్నాడు రామ్మూర్తి.

"అవును మీరు శిల్పం చూస్తున్నారు, కవియొక్క ప్రతిభనుగురించి ఆలోచిస్తున్నారు, కవిని నిర్వ్యాజంగా ఆరాధించటం సంఘానికొక పరమావధి అనుకుంటున్నారు; నేను సంఘంగురించి ఆలోచిస్తున్నాను, ప్రయోజనంకోసం వెతుకుతున్నాను, కవివల్ల సంఘానికి ప్రయోజనం ఉండాలంటున్నాను. కళారాధనలో నేను మీవెంట రాలేను; సంఘారాధనలో మీరు నావెంట రాలేరు. ఎవరిదారిన వాళ్ళం

పోదాం...అయితే నేను మీలాగా ఆత్మానందంతో తృప్తిపడి ఉండలేకకాదు సుమండీ—నేను ఆనందించినంతమాత్రంచేత లోకానికేం ఒరిగిందని!"—

ఈ విసురువిసిరి కుర్రాడు వెళ్ళిపోయినాడు. అతనెవరో రామ్మూర్తికి తెలీదు, పేరుకూడా మరిచిపోయినాడు. కాని అతన్నిగురించి అడపాదడపా రామ్మూర్తికి జ్ఞాపకం వస్తూండేది. వాగ్వాదంలో తానే గెలవాలనే పంతం కలవాడుకాడు రామ్మూర్తి. అతని సాత్త్వికతత్వం దాని కొప్పుకోదు. ఆ కుర్రాడి అభిప్రాయాలు సరయినవి కావని అతనికి గట్టినమ్మకం. అయితే రామ్మూర్తికి లోపల ఒకటే అనుమానం—తను చూసేదంతా చూడటమేగాక ఆ కుర్రాడు మరేదో అధికంగా చూస్తున్నాడని!...

పత్రికలో ప్రచురించటానికి వ్యాసాలు వస్తున్నకొద్దీ రామ్మూర్తికి మరో సమస్య పట్టుకుంది. అతనికి కొత్తరచనలు రుచించటంలేదు. కొత్తవాళ్ళవేకాదు, తనకు అభిమానపాత్రులైన పాతవాళ్ళవికూడానూ! తనకు నచ్చే రచన లిక రావనుకున్నాడు. ఆధునిక సాహిత్యంలో ఒక స్వర్ణయుగం అయిపోయినట్టుగా తోచింది రామ్మూర్తికి.

నవీనసాహిత్యంలో స్వర్ణయుగం పోయిందా, లేక తనలో ఏదో మార్పు వచ్చిందా అనే సమస్య రామ్మూర్తిని బాధించింది. ఆర్థికంగా తాను దెబ్బతినటం ఒకటీ, తాను మద్రాసువచ్చి సాహిత్య వాతావరణానికి దూరంకావటం ఒకటీ చూస్తే ఈమార్పు తనదేనేమో ననిపించింది.

ఆర్థికసంక్షోభం ప్రజల మనస్తత్వాన్ని ఎట్లా మార్చిందీ రామ్మూర్తి తెలుసుకోలేదు. తనలో కలిగినమార్పే అత నర్థంచేసుకోలేదు. వెనక్కు తిరిగిచూసి నిట్టూర్చాడు. ఆ నిట్టూర్పుల ఫలితమే కలావాణి తొలిసంచిక.

త్రిప్లికేనులో ఒక చిన్నభాగం అద్దెకు పుచ్చుకుని రామ్మూర్తి తన భార్యను తీసుకొచ్చాడు. దాదాపు రెండునెలలు అతను భార్యను వొదిలి ఉన్నప్పటికీ ఎందుచేతనో రామ్మూర్తి ఆట్టే విచారించలేదు. ఆస్తి పోయినప్పటినుంచీ ఇద్దరిమధ్యా చిన్న ఎడం ఏర్పడటయింది. ఆమె వొంటిమీది నగలన్నీ అమ్ముకుని తినవలసివచ్చింది. ఏదో అపచారం చేసినట్టే భావించుకున్నాడు రామ్మూర్తి. కల్యాణి తన నగలు వొంటిమీది చర్మం వొలిచి ఇస్తున్నట్టుగా ఇవ్వటం రామ్మూర్తిని మరింత బాధించింది. కాని దుఃఖపడందుకు కతను ఆమెను తప్పు పట్టలేదు. తను మళ్ళీ ఏదోరీతిగా అర్జనలోపడి అంతో ఇంతో వెనకవెయ్యటం మొదలుపెడితేగాని తానుచేసిన అత్యాచారం పరిహారంకావటం ప్రారంభంకాదనీ, తమ యిద్దరిమధ్యా ఏర్పడిన ఎడం పూడదనీ రామ్మూర్తి అనుకున్నాడు.

ఆస్తంతా పోవటమూ, భార్యను ఐశ్వర్యంలో ఉంచలేకపోవటమూ తన తప్పేనని రామ్మూర్తి ఎందుకు భావించాడో ఊహించటం కష్టం. కల్యాణిమాట వినక రామ్మూర్తి చేసిన దుర్వ్యయం ఏమీలేదు. ఆమె ఆర్థిక విషయాల్లో అతని కెప్పుడూ ఎటువంటి సలహాకూడా ఇవ్వలేదు—ఇచ్చే తాహతు ఆమెకు లేదుకూడానూ.

ఆస్తి పోవటంతో తాత్కాలికంగా కల్యాణిలోవచ్చిన మార్పు పట్నంరాగానే పోయింది. స్థలం మార్పువల్ల ఆమె గతాన్ని సులభంగా మరిచిపోగలిగింది. కాని తన వొంటిమీది నగలుమాత్రం ఆమెకు మరుపురాలేదు. నిజమైన దారిద్ర్యం - తిండీ, బట్టా, లేకపోవటమూ; వీటికోసం పరాయివారికి చాకిరి చెయ్యవలసి రావటమూ— కల్యాణి ఎరగదు. అందుచేత ఆవిడకు దారిద్ర్య ఫలితాలను చూసి భయపడే అవకాశం కలగలేదు. కాని తన ఒంటిమీది నగలు లేకపోవటం చూసి నలుగురూ, 'వీళ్ళకేమీ లేదుకాబోలు' అనుకుంటారని ఆమె కెక్కడలేని దిగులూనూ.

పట్నం వచ్చినతరవాత రామ్మూర్తిలో మరోరకం మార్పుకూడా వచ్చింది. ఆస్తి పోకపూర్వం రామ్మూర్తికి తన ఆర్థికస్థితి గురించి అసంతృప్తి ఎన్నడూ కలగలేదు. వాళ్ళ స్వగ్రామంలో ఇంతకన్న ఆస్తిపరులు లేకకాదు. అతని దగ్గర వాళ్ళలోనూ లక్షాధికార్లున్నారు. ఐతే ఆ తేడాలు జీవితవిధానంలో ద్యోతకం కాలేదు. తినే తిండిలోనూ, కట్టే బట్టలోనూ, నాటకాలకు కొనే టిక్కెట్లలోనూ, చదివే పుస్తకాల్లోనూ రామ్మూర్తి సులభంగా వాళ్ళతో పోటీ చెయ్యటమేగాక నూటికి తొంభైసార్లు వాళ్ళనుమించి వెళ్ళగలిగేవాడు.

పట్నం వచ్చినతరవాత అతనికీ సంతృప్తి చిక్కలేదు. ఇక్కడ అతను ఎవరితో పోటీచేస్తాడు? ఇక్కడ అతని పరిచయస్తులలో రెండుమూడు లక్షలతో వ్యాపారం చేస్తున్నవాళ్ళున్నారు, కార్లున్నవాళ్ళున్నారు, బట్టలదుకాణంలోకిపోయి తన నెలజీతంపెట్టి భార్యలకు అవలీలగా ఒక చీర కొనిపెట్టేవాళ్ళున్నారు, పెద్ద బంగళాల్లో నివసిస్తున్నవాళ్ళున్నారు. ఈ పట్నంలో తనజీతం తెచ్చుకునేవాళ్ళు దమ్మిడీల దగ్గర్నుంచీ ఆదా చెయ్యటానికి ప్రయత్నిస్తారని అతను గ్రహించాడు. వాళ్ళని తను అనుకరించకపోయినప్పటికీ వాళ్ళజాగ్రత్త కొంతైనా అతని చేతికి ఖర్చుచేసేటప్పుడు అడ్డుతగలక పోలేదు. చేసేదేమీలేక రామ్మూర్తి ఈ స్థితికి ఆమోదించాడు. రామ్మూర్తికి స్వగ్రామంలో వర్ణవ్యవస్థ కనిపించినంత స్పష్టంగా వర్గ వ్యవస్థ కనిపించేదికాదు. ఇక్కడ అది కనిపించసాగింది. కాని రామ్మూర్తికి విషయం ఇంతస్పష్టంగా తెలిసిరాలేదు.

* * *

ఒక విధంగా దీనికంతకీ కారకుడు వెంకటేశ్వర్లు. చాలా చిత్రమైన వ్యక్తి వెంకటేశ్వర్లు. చూట్టానికి ఇరవై, ఇరవై రెండేళ్ళ వాడల్లే ఉండేవాడు కాని ముఫ్ఫై నిండినై. పొట్టిగా సన్నగా గిడసగా ఉండేవాడు. పిల్లిగడ్డం, పల్చని మీసాలు. రెండూ గొరుక్కుంటే బ్రహ్మదేవుడికూడా అతని వయస్సు తెలిసేదికాదు. మనిషి ఆకారానికితగ్గట్టే సంభాషణా, బుద్ధులూనూ. ప్రపంచజ్ఞానం తెలీనివాడల్లేనూ, దుర్మార్గుల వాతపడ్డ వాడల్లేనూ మాట్లాడేవాడు. పద్యాలు రాసేవాడు, కథలు రాసే వాడు, బొమ్మలు గీసేవాడు, సంగీతం పాడగలనని చెప్పేవాడు; కొన్నాళ్ళు నాటకం కంపెనీలకు హార్మోనిస్టుగా ఉన్నట్టు చెప్పాడు. గడియారాలు రిపేరు చేసేవాడు. ఎంత కొత్తవాడితోనైనా ఆబాల్యస్నేహం ఉన్నట్టు మాట్లాడేసేవాడు. ఎప్పుడైనా సాయంకాలంపూట వచ్చి కలావాణి ఆఫీసులోకూచుని బాతాఖానీ కొడుతూండేవాడు.

మొదట్లో వెంకటేశ్వర్లునుచూసి రామ్మూర్తి అనుమానించాడు. అంత పూసుకు తిరిగేవాళ్ళనుచూస్తే రామ్మూర్తి కనుమానం. అదీకాక అతనికి తనతో ఏంపనో రామ్మూర్తికి అర్థంకాలేదు. డబ్బుకోసం వస్తున్నాడేమో అనుకున్నాడు. అది కాదని తేలిపోయింది. అతనెక్కడో ఒక పత్రికలో పని చేసుకుంటున్నాడు. ఓ యాభై తెచ్చుకుంటున్నాడు. సిగిరెట్లుతప్ప అతనికి చెప్పుకోదగ్గ ఖర్చేమీలేదు.


వెంకటేశ్వర్లుకు తన ఉద్యోగం నచ్చలేదు. కాస్తయినా గౌరవం లేదు. ఏ మాత్రం కోపం వచ్చినా ఇంటో నౌకరునుచూసినట్టు చూస్తారు. నోటికొచ్చిన మాటల్లా అంటారు. వాళ్ళకి మనిషితో పనిలేకపోతే గౌరవంగా నోటీసిచ్చి పంపెయ్యరు. 'ఎందుకయ్యా, నువు మా ఆఫీసులో? నిన్నెందుకు పెట్టుకున్నట్టూ?' అని వెధవ అత్తగారు కోడల్ని అనే మాటలన్నీ అంటారు.

'ఇటువంటి బైతులు పత్రికలునడిపి కళోద్ధారకులూ, నాబోటి దరిద్రులకు అన్న దాతలూ అయినారు!' అన్నాడు వెంకటేశ్వర్లు.

'అంత ఇష్టంలేని నౌకరీ మానుకోరాదా?' అన్నాడు రామ్మూర్తి. తన యజమా నుల నీచ ప్రవర్తనచూసి అసహ్యపడే సంస్కారమే ఉంటే వెంకటేశ్వర్లా ఉద్యో గం ఎందుకు మానుకోడని రామ్మూర్తి సందేహం.

'మానుకుని ఏం చెయ్యాలి? భుక్తిగడిచేదెట్లా? మనకు ముందునకుంజూడ వెనుకసున్న! ఏ రోజు మావాళ్ళు నన్ను వెళ్ళగొడితే ఆ రోజు నేను వీధిలో నిలబడి కాఫీకి అర్థణా ముష్టెత్తాలి,' అన్నాడు వెంకటేశ్వర్లు.

వెంకటేశ్వర్లు అభిప్రాయాలతో రామ్మూర్తి ఏకీభవించలేదు. అతని బద్ధకమేగాని గౌరవయుతంగా బతికేమార్గాలు ప్రపంచంలో బోలెడుండి ఉండాలి. ఉద్యోగాలలో




మర్యాదలేకుండా పోవటానికి కారణం మర్యాదమీద నిలబడకుండా ఉద్యోగాలు చెయ్యటానికి తయారయ్యేవాళ్ళే. ఒకప్పుడు తాను ప్రతీ ఉద్యోగమూ కూలిపనే అనుకుని ఉండినసంగతి రామ్మూర్తి మరిచాడు. జీవితం – అందరి జీవితమూ – క్రమంగా ధనికవర్గంయొక్క అధీనంలోకి వెళ్ళిపోతున్నదని గాని, డబ్బుకూ సంస్కారానికి అవినాభావ సంబంధమేమీ లేదనిగాని రామ్మూర్తి గ్రహించలేదు. అసహాయస్థితిలో ఉన్న వెంకటేశ్వర్లును చూసి సానుభూతి పడటానికి బదులు రామ్మూర్తి కొంత తృణీకారభావంతో, అసమర్థుణ్ణి చూసినట్టు చూశాడు.

కాని ఈ అసమర్థుడైన వెంకటేశ్వర్లే రామ్మూర్తిని వర్గసోపానాలలో ఒకటి రెండుమెట్లు పైకితోశాడు. ఒకనాడు సాయంకాలం వెంకటేశ్వర్లు రామ్మూర్తి దగ్గరికి వచ్చి, 'అయ్యా, ఇవాళ ఈ ధన్యుడు మీకు క్షా పోయించబోతున్నాడు' అన్నాడు. అతను ఉద్యోగం వొదిలేసినట్టు చెప్పాడు.

'అయ్యొయ్యో, అంత తొందర ఎందుకుపడ్డావ్? మళ్లీ ఇంకోటి చూసుకొని మరీ వొదిలెయ్యలేకపోయినావా?' అన్నాడు రామ్మూర్తి.

'ఇంకో ఉద్యోగం చూశానే!' అన్నాడు వెంకటేశ్వర్లు. 'నాటక కంపెనీ ఒకటి పెడుతున్నాం.'

'ఎవరది?' అన్నాడు రామ్మూర్తి ఆశ్చర్యంతో.

'ఇంకెవరు? నేనే! డబ్బు మరో ఆయన పెడుతున్నాడు. వెయ్యి రూపాయలు పెట్టుబడిపెడితే ఆరు నెల్లకిల్లా పెట్టుబడి తిరిగి వస్తుందని నమ్మించా! సరే నన్నాడు. ఇవాళే వెయ్యిరూపాయలూ బాంకులో మా ఇద్దరిపేరా జాయింటుగా వేయించా!... అట్లా కాఫీ ఆలయానికిపదండి, సంగతంతా చెబుతా. మీతోకూడా కొంతపని ఉంది మరి,' అన్నాడు వెంకటేశ్వర్లు.

ఇద్దరూ చైనాబజారుకేసివచ్చి ఒక కాఫీహోటల్లో ప్రవేశించారు. రెండుకప్పులు కాఫీ తెప్పించాడు వెంకటేశ్వర్లు. సిగిరెట్టు పెట్టెతీసి బల్లమీద పెట్టాడు.

'ప్రస్తుతం గయోపాఖ్యానం ప్రాక్టీసుచేస్తాం. ఎందుచేతనంటే నా దృష్టిలో ఇద్దరాడవాళ్ళున్నారు గాని వాళ్ళు కాస్త నలిగితే తప్ప రంగు బయటికిరాదు. ముఖ్యంగా మా వూరి వెంకటసుబ్బిమీద నా ఆశలన్నీ పెట్టుకున్నా. చక్కగా పాడుతుంది, కాని పెడకట్టైపుండ. స్టేజీ ఎక్కి అది ఏం చేస్తుందోకూడా చెప్పలేం,' అన్నాడు వెంకటేశ్వర్లు.

'ఆడవాళ్ళు ఆడవేషాలు వెయ్యటంలో నాకు విశ్వాసంలేదు. నేను వెనక స్థానంతో ఈ మాటే అన్నాను. 'రాఘవాచార్లు గారు మహానుభావులు; వారికి విరుద్ధంగా చెప్పటానికి నేను తగనిమాట నిజమేగాని, ఏ ఆడది స్టేజి ఎక్కి మీ మాదిరిగా పాత్ర నిర్వహణం చేస్తుంది?' అని అడిగాను. స్థానం నవ్వి ఊరుకున్నాడు,' అన్నాడు రామ్మూర్తి

"బాబోయ్! మీరు అసలుకే ఎసరుపెట్టకండి. ఈ ఇద్దరాడంగులూ ఉంటే కొంత ఆర్థికంగా లాభిస్తుందని నా ఏడుపు! అదీగాక రాఘవాచార్లు గారి అభిప్రాయాన్ని కొట్టెయ్యటానికి వీల్లేదు. ఒక్కనాడు ఆకస్మాత్తుగా ఆడదాన్ని స్టేజి ఎక్కిస్తే ఏం చేస్తుందీ? ఎంతమంది మగవాళ్ళలో నుంచి ఒక స్థానంవా రొచ్చారూ? రాఘవాచార్లు గారి మాదిరిగా చెయ్యలేంగదా అని మిగిలిన వాళ్ళంతా మానుకుంటారా?"

"సరే నీ యిష్టం!" అన్నాడు రామ్మూర్తి.

'అట్లా నా ఖర్మానికి నన్ను వొదిలేస్తేకాదు. నేను మరో సంవత్సరానికైనా నా ట్రూపుతో పట్నంవచ్చి ఇక్కడ ఒక నాటకం ఆడి మా బాస్‌కు కాంప్లిమెంటరీ టిక్కెట్టు పంపుతానుగాని విడిచిపెడతానా? ఐతే మీరు నాకు చెయ్యవలసిన ఉపకారం ఏమిటంటే, ఒక చక్కని నాటకం రాసిపెట్టండి-చక్కని సాంఘిక నాటకం. నాకు పెద్ద బ్రహ్మాండమైన కథావస్తువు లక్కర్లేదు. అందరికీ తెలిసిన సామాన్య విషయమే తీసుకోండి. మామూలు సంభాషణలతో నాటకం నడపండి. మిగతాది నేను చూస్తాను. ఈ గయోపాఖ్యానం మూడు నెల్లపైన ఆడనులెండి. ఈ లోపుగా ఆ

వెయ్యొ వచ్చేస్తే డబ్బుపెట్టేవాడి బెదురు తీరుతుంది. అందుచేత నాటక కర్తకి మంచి లాభమే గిట్టుబాటయేట్టు చేతామని చూస్తున్నాను...అన్నట్టు నాటకంలో పద్యాలు పెట్టకండి. నాకో కొత్త ఐడియా కలిగింది. పాటలతో కొట్టేదామని. పద్యాలు చదవట మంటే అద్దంకి, రామనాథశాస్త్రి, స్థానం వీళ్ళతో పోలిస్తే మా నాసి వెధవ లెక్కడ నిలబడరారు?...నాటకం సంగతి మరిచిపోరుకాదూ?'

రామ్మూర్తి ప్రస్తుతిలో గమనించవగ్గ విషయం ఏమంటే, అతను కొనకు నాటకాలు రాయటంలో అనుభవంలేదని కాని, మరెవరిచేతనన్నా రాయించుకోమని కాని, వెంకటేశ్వర్లు పెట్టబోయే నాటకసమాజంలో తనకు విశ్వాసంలేదని కాని పైకి అన లేదు. అట్లాగే రెమ్మన్నాడు.

కాఫీతాగటం అయినాక సిగిరెట్టొకటి తీసుకోమని వెంకటేశ్వర్లు ప్రేరేపించాడు. రామ్మూర్తి తన కభ్యాసం లేదన్నాడు

'అదేమిటి, మేష్టారూ? నేను చెడవాణ్ణేనా? నా కంపెనీకి విజయం కోసరం ఒక్కటి అంటించి పారేస్తురూ! లేకపోతే దుశ్శకునంగా ఉంటుంది! కవులు సిగిరెట్టు కాల్చకపోవట మేమిటండీ? అనుభవంలో అందరికన్నా ముందుండవలసిన వాళ్ళు కదా!' అన్నాడు వెంకటేశ్వర్లు.

ఎప్పుడో ఎవరో అన్న ముక్కలు జ్ఞాపకంవచ్చి నవ్వుతూ రామ్మూర్తి సిగిరెట్టు తీసుకుని వెలిగించి పీల్చాడు. గొంతంతా మండింది. ఊపిరి సలపలేదు, దగ్గొచ్చింది. మొహం కంది జేవురించింది.

'ఛీ, ఛీ!' అన్నాడు రామ్మూర్తి.

'ఎందులో అయినా మజా ఒక్కసారిగా బోధపడదు, మేష్టారూ! నాటకంమటుకు ఇవాళనుంచే మొదలుపెటండేం?' అంటూ వెంకటేశ్వర్లు దోసిపుచ్చుకున్నాడు.

కొంతదూరం వెళ్ళి చూసుకుంటే కొంచెం కాల్చిన సిగిరెట్టింకా చేతిలోనే ఉంది. రామ్మూర్తి దాన్ని పారెయ్యనేలేదు. రోడ్డుమీద నిలబడి భయపడుతూ సన్నగా మళ్ళీ పీల్చి చూశాడు. అతని వెనకగా ఎవరో ఇద్దరు కుర్రాళ్ళు నవ్వుకుంటూ వెళ్ళారు. తనని చూసే ననుకున్నాడు. కోపం వచ్చింది. మరింత గట్టిగా పీల్చాడు. నోరంతా అసహ్యం వేసింది

రామ్మూర్తి ట్రిప్లికేనుబస్సు పట్టుకున్నాడు.

బస్సు ఎక్కేవరకు రామ్మూర్తిని సిగిరెట్టు పారెయ్యమని హెచ్చరించాడు. రామ్మూర్తి బస్సులో కూచుని ఇంటికి వెళ్ళుతూ, 'వాళ్ళు చూసి నవ్వింది నన్ను కాకపోవచ్చు,' అనుకున్నాడు. ఆలోచించిన కొద్దీ ఆ ప్రభావం బలపడింది.

ఇంటికి వెళ్ళగానే కల్యాణి దగ్గరికొచ్చి మొహానికి మొహం చేర్చుతూ, 'ఏమిటీ వాసన?' అని అడిగింది.

'ఎవరో అతను కాఫీ పోయించి సిగిరెట్టిచ్చి కాల్చమని బలవంతం చేశాడు.'

'ఎందుకీ పాడలవాటూ? ఎన్నడూలేదూ!' అన్నది కల్యాణి.

'ఒక్క సిగిరెట్టుకే అలవాటవుతుందా? పైగా చాలా రోతగా ఉంది. అవి ఎట్లా అలవాటు చేసుకుంటారో జనం?' అన్నాడు రామ్మూర్తి.

'ఎవరీ పాడుస్నేహితుడు?' అన్నది కల్యాణి.

'పాడుస్నేహితుడేం? మంచివాడే. నాటకకంపెనీ పెట్టాడు. నన్నో నాటకంకూడా రాయమన్నాడు. బాగా డబ్బు ముట్ట చెబుతానన్నాడు.'

'చివరికి నాటకాలవాళ్ళతోనా స్నేహం? ఇతనేమన్నా స్థానం మాదిరిగా గొప్ప నటుడా?'

'ఇతను హార్మోనిస్టనుకుంటా!'

'బాగుంది! చాల్లెండి. కాకపోయినా, మీరు నాటకం రాయట మేమిటి?'

'ఏం బ్రహ్మవిద్యా?' అన్నాడు రామ్మూర్తి ఆశ్చర్యంతో, తన పరువంతా పోయినట్టుగా.

'మీకు చాతవుతుందీ?' అన్నది కల్యాణి, తప్పుచేశానని కనుక్కొని.

'మా చక్కగా చాతవుతుంది. అసలు నాటకాలు రాయవలసింది నాబోటిగాళ్ళే. మరీ తుక్కు వెధవలంతా నాటకాలు రాసేసి తగలేస్తున్నారు.'

కాని రామ్మూర్తి నాటకం రాయటానికి ఉపక్రమించనేలేదు. అసలు దాన్నిగురించి అతను ఆలోచించనుకూడాలేదు. ఆఖరుకు వెంకటేశ్వర్లు గొడవకూడా మరిచిపోయినాడు.

రెండునెల్లు గడిచింది. ఓరోజు సాయంకాలం ఆంధ్రపత్రిక కొని పేజీలు తిప్పుతూ ఉండగా ఒక నాటక ప్రదర్శనంమీద పరామర్శపడింది. ఆ నాటకం గయోపాఖ్యానమని తెలిసినాకూడా వెంకటేశ్వర్లు జ్ఞాపకం రాలేదు. అందులో సుభద్రపాత్ర ధరించిన సుభద్రాదేవి బ్లాకు పడింది. అది చూసి రామ్మూర్తి, 'మనిషైనా బాగాలేదు.' అనుకున్నాడు. బస్సులో ఎక్కి ఇంటికి వెళుతుండగా స్ఫురణకు వచ్చింది, ఈ కంపెనీ వెంకటేశ్వర్లుదే అయి ఉండాలని. నాటకం చాలా బాగుందని రాశారు పత్రికలో. నిజంగానే బాగుందో, లేక వెంకటేశ్వర్లు అట్లా రాయించాడో?

మర్నాడు వెంకటేశ్వర్లు దగ్గర్నుంచి కార్డు వచ్చింది.



'మేష్టారూ, 25వ తేదీకి పట్నం వస్తున్నాను. వెయ్యి వచ్చేసినై. మీ నాటకం పూర్తి అయిందా? వెంకటేశ్వర్లు.'

రామ్మూర్తి ఉత్తరంకేసి నమ్మలేనివాడల్లే చూడసాగాడు.

*　　　*　　　*

ఇరవైఐదోతేదీన వెంకటేశ్వర్లు తన ఆఫీసులో ప్రత్యక్ష మయ్యేనాటికి రామ్మూర్తి నాటకరచనలో ఎంతదాకా వచ్చాడంటే తన పాతకథల్లో రెండోదీ, ఉత్తమ మయినదీ అయిన 'ప్రాయశ్చిత్తం' నాటకరూపంలో దింపుదామనే నిర్ణయానికి వచ్చాడు.

ఆ కథ ఉన్నదున్నట్టే తీసుకోవటమా, కొద్దిమార్పు చేయటమా అని సందేహం వచ్చింది. డాక్టరుచేతిలో రోగి చనిపోయినట్టూ, డాక్టరు అతనిభార్యను పెళ్లాడినట్టూ

చేస్తే బాగుంటుందేమో ననిపించింది. ఐతే డాక్టరుభార్య ఏం కానూ? ఆవిడేకూడా ఏ క్షయవ్యాధితోనో చంపేస్తే? ఎందుకు, పాపం? డాక్టరు రెండోపెళ్ళి చేసుకోటానికి ఆవిడ ఆమోదించినట్టుచేస్తే బాగుండదూ? ఈ సమస్యలన్నీ తాపీగా కూర్చుని ఆలోచిస్తే తప్ప తేలవు. అన్నట్టు పశ్చాత్తాపమనే పేరుకూడా మార్చవలసి ఉంటుంది— అంటే, ఈ మార్పులన్నీ నిజంగా చెయ్యదలిస్తే మాట!

ఈ సమస్య లేవీ తేలకముందే వెంకటేశ్వర్లువచ్చి కూర్చున్నాడు.

'ఏం, మేష్టారూ? ఏదీ నాటకం?'

ఇంకా రాయలేదన్నాడు రామ్మూర్తి నవ్వుతూ.

'సిగిరెట్టుమీద ప్రమాణం చేయిస్తినే! ఇంత ద్రోహమా?'

'సిగిరెట్టుమీద ప్రమాణంచేసి తప్పటానికి నా అంతరాత్మ ఒప్పుకుంటుంది.'

'మీకు సిగిరెట్టుమీద గురికుదరకపోతే మధ్య నేను హతమారిపోతానే. ఇదిగో సిగిరెట్టొకటి తగిలించండి, ఈ విషయం ఏమిటో ఇప్పుడే తేల్చుకుందాం.'

ఇద్దరూ సిగిరెట్లు వెలిగించారు. రామ్మూర్తికిది రెండో సిగిరెట్టుకాదు. అతనిలో ఏదో వైపరీత్యం వుంది. సిగిరెట్టునుగురించి ఆలోచించనంతకాలమూ అది అతన్ని ఆకర్షించలేక పోయింది. కాని దాన్నిచూసి అసహ్యపడటం కలిగేసరికి అది ఆకర్షణ అయి కూచుంది. ఈ రెండు సిగిరెట్లమధ్యా రామ్మూర్తి సమారుగా రెండుపెట్టెల సిగిరెట్లు, రోజుకు ఒకటిమించకుండా కాల్చాడు.

'మీ నాటకానికి ఏకంగా ఓ అయిదువందలు పుచ్చుకుంటారా? లేక నాటకానికి పది చొప్పున పుచ్చుకుంటారా? అట్లానూ కాకపోతే మా లాభాల్లో రూపాయికి అణా భాగం పుచ్చుకుంటారా? నాకు మీరు ఏడాదికి రెండు నాటకాలు రాసి ఇవ్వండి, పుచ్చుకుంటాను ఏదోటి చెప్పెయ్యండి' అని వెంకటేశ్వర్లు తొందరచేశాడు.

నాటకం పూర్తిచేసిగాని ఏదీ చర్చించనన్నాడు రామ్మూర్తి. సంవత్సరానికి వెయ్యిరూపాయల ఆదాయం అతన్ని మహాబలవత్తరంగా ఆకర్షిస్తున్నది.

ఏమిటి విశేషాలు? ఎన్ని నాటకాలు పడినై? డబ్బేవిధంగా వచ్చింది?' అన్నాడు రామ్మూర్తి సరదాగా.

నెల రోజులు రిహార్సల్సుతో సరిపోయింది. డజను నాటకాలాడాం. సొంతాన ఆడినవాటికి మూడువైన లాభం కనిపించలా. అందుకని నూరేసి రూపాయలకు కంట్రాక్టు పాడేశా. కంట్రాక్టులు తీసుకున్నవాళ్ళు బాగా డబ్బుచేశారు. ఆడమనుంచ లంటే, ఏమన్నా చెప్పండి అంతదే.'

బాగుందన్నాడు రామ్మూర్తి.

'రేపు మెయిల్లో దిగుతారు జట్టు. 28 కి ఇక్కడ నాటకం పెట్టిస్తున్నా. లాభం రాకపోతే పీడాపాయిరి, ఇక్కడ మంచి పబ్లిసిటీ జరిగితే, తరవాత ఎంతలాభమన్నా వస్తుంది. మరేం లేదుగాని, మరీ ఒక్క నాటకమే అయిపోయింది, మేష్టారూ. నాలుగైదు నాటకాలుంటే చెడుగుడు ఆడిస్తను. దేశమంతటా చక్కగాపాడే కుర్రాళ్లున్నారు. తీసుకుని ఊరికే మేపాలిసిందేగా?' అన్నాడు వెంకటేశ్వర్లు.

అతని మాటధోరణి దగ్గర్నుంచీ మారినట్లు రామ్మూర్తి కనిపెట్టాడు. పెద్దపెద్ద నాట్యకళారాధకుల మాటల్లోవుండే వుదాత్తత వెంకటేశ్వర్లు ధోరణిలో లేదు. ఇదంతా డబ్బు లెక్కపెట్టుకోవటమూ, దేశాన్ని కొల్లగొట్టుకోవటమూగా కనపడది. వీడి కోసం నాటకం రాయటమంటేనే ఒక విముఖత్వం కలగసాగింది. కాని రాయటం మానరాదు. రాసి అంతగా అయితే ఏ స్థానం చేతిలోనో రాఘవాచార్లుగారి చేతిలోనో పెట్టవచ్చు. పెద్ద పెద్ద నటకులు తనబోటి రచయితలమీద ఆధారపడరనీ, ముందు రాబోయే నాటకకర్తలకి పోషకులు వెంకటేశ్వర్లు కన్నకూడా హీనంగా వుంటారనీ రామ్మూర్తి తెలుసుకోలేదు.

వెంకటేశ్వర్లుకు టూకీగా ప్రాయశ్చిత్తం కథ చెప్పాడు రామ్మూర్తి. వెంకటేశ్వర్లు పొంగిపోయినాడు. రోగి పెళ్లాంవేషానికి సుబ్బి పనికొస్తుందన్నాడు వెంకటేశ్వర్లు సుబ్బిని కొంచెం నేర్పి మెచ్చుకున్నాడు. దానికి పూర్తిపోగా బుర్రలేకపోయినా అందిస్తే బాగా పట్టుకుంటుందన్నాడు. రిహార్సల్లో ఒక్కసారి సరిగా చేసిందంటే ఏవేళప్పుడడిగినా ప్లేటు దించేస్తుందన్నాడు. అది సుబ్బిలో మహత్తు. సుబ్బి అంటే సుభద్ర. ఆ వేషం వేసింది గనక అదే సార్థనామం అయిపోయింది.

'రేపు నా బృందాన్ని మీయింటికి తెస్తా' అన్నాడు వెంకటేశ్వర్లు.

'కథలో కొన్ని మార్పులు చేద్దామనుకుంటున్నాను,' అన్నాడు రామ్మూర్తి.

'ఏ కథలో? ఓహో, ప్రాయశ్చిత్తంలోనా? ఏం మార్పులూ?'

రామ్మూర్తి చెప్పాడు. వెంకటేశ్వర్లు గోలెత్తాడు. ఏమీ మార్పులు వొద్దన్నాడు.

నాటకం ఉన్నదున్నట్టుగా రాయటానికి తీర్మానమయింది. అసలు పేరే ఎంతో బాగుందన్నాడు వెంకటేశ్వర్లు.

మర్నాడు ఆదివారం. మధ్యాహ్నం రెండుగంటలప్పుడు మందను వెంటపెట్టుకుని వెంకటేశ్వర్లు ట్రిప్లికేనులో రామ్మూర్తిగారింటికి వచ్చాడు.

వెంకటేశ్వర్లు వెంట ముగ్గురు మొగవాళ్ళూ ఒక ఆడది వచ్చారు. మరో ఆడమనిషి ఇవాళ మొగాళ్లు వచ్చేముందుకాసికి వెళ్ళారుట. వచ్చిన మొహాల్లో ఒక్క మొహానా దీపారాధన కనిపించలేదు. వీళ్ళు వ్యక్తులుగా ఏనాటికైనా గొప్పనటులవుతా

రనేది చాలా అనుమానాస్పదంగా కనిపించింది. వీళ్లేం నాటకాలాడారో, వాటికి డబ్బెట్లా వచ్చిందో రామ్మూర్తి ఊహించుకో లేకపోయినాడు. దేశంలోవున్న ప్రఖ్యాత నటులతో వీళ్ళెట్లా పోటీచేస్తారు? దొరక్క-దొరక్క తనకీ బృందం దొరికిందేమిటి?

అందర్నీ రామ్మూర్తికి పరిచయం చేశాడు వెంకటేశ్వర్లు. అందరూ తనకేసి భయంగా చూశారు - హెడ్మాస్టరు ముందు పిల్లలల్లే.

రామ్మూర్తిని కూడా వాళ్ళకు పరిచయం చేశాడు వెంకటేశ్వర్లు.

'ఈయనే రామ్మూర్తిగారు. గొప్ప పత్రికా సంపాదకుడు. ఈయన మనల్నిగురించి రెండుముక్కలు పత్రికల్లో రాశారంటే వేలకువేలమంది చదువుతారు. దేశం మొత్తంమీద ఈయన ఎరగని కవిగాని నటకుడు గాని లేడన్నమాట.'

వెంకటేశ్వర్లు తమతో అట్లా మాట్లాడుతుంటే వాళ్ల అతనిమీద పడి కొట్టలేదు. ప్రపంచంలో ఇంత మేకలుంటారని రామ్మూర్తి ఎప్పుడూ అనుకోలేదు. తన చిన్న తనంలో ఇటువంటి మేకల్ని అలగా జనంకింద చూసేవాళ్ళు. వాళ్ళకోసం వేరే భాష మాట్లాడేవాళ్ళు. ఆ అలగా జనం సంస్కారంలేని కూలిపనిమాత్రమే చేసే వాళ్ళు. ఈనాడా తరగతి కళా ప్రదర్శనాలలోకి వచ్చిందా? రామ్మూర్తి నమ్మలేక పోయినాడు.

అకస్మాత్తుగా చెవిలో కాకి అరిచినట్టయింది. ఉన్నట్టుండి ఆడకూతురు కాస్త నోరు చేసుకుంది.

'మనకి నాటకం రాస్తావుం దీరేనా?'

రామ్మూర్తికి చెంపదెబ్బ తగిలినట్టయింది. అతను పత్రికలో చూసిన సుభద్రను గుర్తుపట్టలేదు. ఎంత సాత్వికుడైనా ఆ క్షణాన అతని కాగ్రహంవచ్చింది. 'నీ మొహానికి నేను నాటకం రాస్తున్నానా? ఎవరు చెప్పారు?' అని గట్టిగా అరుద్దామను కున్నాడు.

సుబ్బి - లేక సుభద్ర - తనకేసి ఆప్యాయంగా చూసి నవ్వుతున్నది. అప్పుడే తనువాళ్ళ జాతిలో చేరిపోయినాడు!

'నాటకం రాయనని ఇప్పుడే చెప్పెయ్యి. ఆదినిష్ఠూరం మేలు,' అని తొందర చేస్తున్నది రామ్మూర్తి అంతరాత్మ.

'వీళ్ళను వొదలకు. పెద్దవాళ్ల నిన్ను దగ్గరికి రానిస్తారా? శుష్క ప్రియాలు చెబుతారు. వాళ్ళమీది వ్యామోహం వదులుకో. ఎక్కువ వాళ్ళ మధ్య అనామకుడుగా ఎంత కాలం వుంటావు? నీకు డబ్బక్కర్లేదా?' అని అతని బుద్ధి హెచ్చరించింది.

ఇటువంటి సంఘర్షణలో అంతరాత్మ గెలవటమనేది సామాన్యంగా ఉండద
రామ్మూర్తి నవ్వి, 'అవును నేనే,' అన్నాడు.

మనస్సు నెంత సమాధాన పరచుకుందామన్నా సుభద్ర తన నాటకానికి నాయిక? ఊహించుకోవటానికి సాధ్యంకాలేదు. మనిషి చామనచాయగా వుంది. మొహ ఏమంత ఫర్వాలేదు. మనిషికూడా చలాకీగానే వుంది గాని సంస్కారం ఎక్కు లేదు. వొంటిమీద ఒక్క నగలేదు. చెవులకూ్కడా ఏమీలేవు. చేతులకి ఒక్కొక్క బంగారపు గాజు—మాయ బంగారపు గాజు!—ఉంది. మాసినచీర కట్టింది. చీరె కట్టులో కూడా ఏమీ ప్రత్యేకత లేదు. పక్కపాపట తీసివుంది. జుట్టుకు చమురుకూడా లేదు పొట్టిమనిషి, కాని నడుము సన్నగావుండి కుదిరికగావున్న విగ్రహం. పద్దెనిమిదేళ కన్న వుండవు.

అయితే ఏం? ఈ సుభద్రనే ఎవరో విలేఖరి తెగమెచ్చుకున్నాడు. ముందు ము దీమె చాలా పైకొస్తుందనికూడా రాశాడు. కళాభిరుచి ప్రజల్లోనే కాక విమర్శకుల్లో కూడా నశిస్తున్నదా?...లేక దీనితో వాడికేమన్నా —

'ఎల్లుండి నాటకం. హాలు మాట్లాడేశాను. మీరు, మీ భార్యగారూ రావటమేగాక మీ స్నేహితుల్నికూడా పట్టుకురండి. మా ట్రూపును గురించి నలుగురూ తెలిసిన వాళ్ళు తమ అభిప్రాయాలిస్తే లోపాలు దిద్దుకోవటానికి వీలుపడుతుంది ... నాటకం రాయటం ప్రారంభించారా?' అన్నాడు వెంకటేశ్వర్లు.

'ఏదీ? ఇంకా ఎక్కడా?' అని రామ్మూర్తి దిక్కులుచూస్తూ నీళ్ళు నమిలాడు.

కల్యాణి కాఫీలుతెచ్చి అందరికీ ఇచ్చింది. వెంకటేశ్వర్లు బృంద అయేవరకూ ఎవరూ కాఫీకేసి చూడనైనా చూడలేదు. తన ఈ అతిథులు కాఫీ తాగుతుంటే రామ్మూర్తికి మంచిరోజులు జ్ఞాపకంవచ్చినై. ఆర్థికంగా మంచిరోజులని కాదు. ఆర్థికంగానే చూస్తే ఈ రోజులే మంచివని రామ్మూర్తి ఏనాడో తేల్చుకున్నాడు. కాని తన యింటికి ఆ రోజుల్లో అతిథులుగా వచ్చినవా శ్శెక్కడ; వీళ్ళెక్కడ? ఆనాటి సంభాషణలెక్కడ, ఈ సంభాషణ ఎక్కడ? ఎట్లా వచ్చిందీ పతనం? ఏమిటీ మార్పు—?

28 నాటి గయోపాఖ్యాన ప్రదర్శనానికి రామ్మూర్తి భార్యాసమేతంగా వెళ్ళాడు. అతనికి ముందువరసలోనే రెండుసీట్లు ప్రత్యేకించారు. (ఇంత గౌరవం వెనక అతని కే నాటకమిత్రులూ చేసివుండలేదు.)

హాలు బాగా నిండలేదు. రెండువందలకు మించి దబ్బొచ్చి వుండదు. సరిగా టైముకు గంటకొట్టారు, ప్రార్థనపాడారు. నాటకం అద్భుతంగా రక్తిగట్టబోతున్నదని

మొదట్లోనే రామ్మూర్తికి తేలిపోయింది. మిటి కాఫీ హోటలు పెట్టుకున్న త్రాష్టుడు కృష్ణపాత్ర ధరించి రంగంమీదికి రాగానే జనంలో విస్మయం కలిగింది. వేషం అమిత ఆకర్షవంతంగా ఉంది. వచనం అట్టే బాగా చెప్పలేకపోయినా పాటలు పేల్చి పారేశాడు. వాడి గొంతు అద్భుతంగా పలుకుతుంది.

కాని సుభద్ర స్టేజిమీదకి వచ్చిన తరువాత చూడాలి ప్రేక్షకుల ఆనందాన్ని. సుభద్ర కాకికాదు అప్పుడు. స్టేజి లైట్లలో ధగధగా మెరిసిపోయింది. సుభద్ర నటన నటనగా కనిపించలేదు. గారడీ అనిపించింది రామ్మూర్తికి. పాడటానికి గొంతెత్తితే కిన్నెర. ఎక్కువ గానచాతుర్యం లేకపోయినా వినేవాణ్ణి ఇట్టే మభ్యపెట్టే గొంతు.

తెర పడగానే వెనక ఇద్దరు రింగీషులో అనుకుంటున్నారు :

'ఆమె ఎట్లా ఉంది?'

'ప్రాణం ఇక ఏటెయిపోవచ్చు!'

అతిశయోక్తి అయితే నేం? ఆక్షణాన రామ్మూర్తికే అతిశయోక్తు లాగా కనిపించింది.

నాటకం అయిపోగానే వెంకటేశ్వర్లు వచ్చి రామ్మూర్తినీ, కల్యాణినీ స్టేజిలోకి వచ్చి వేషాలువేసినవాళ్ళకి కాస్త ప్రోత్సాహమూ, సలహా ఇమ్మని అడిగాడు.

'వాళ్ళ కొక్కువాల్సిన ప్రోత్సాహమంతా ప్రేక్షకులే ఇచ్చారు. ఇక నేనేమిచ్చేది? సలహా ఇవ్వటానికి ఏముంటుంది? నాటకం పాత్రలు సరిపోయేటట్టు నటించింది. ఒక్కొక్కరైనా ఒక్కచోట నా తొట్రుపడినట్టులేదు. టీమ్ వర్కు చాలా అద్భుతంగా ఉంది!' అన్నాడు రామ్మూర్తి.

'అది లేకపోతే ఒక్కొక్కణ్ణీ ఓల్చి ఎండెయ్యనా?' అన్నాడు వెంకటేశ్వర్లు.

'వెంకటేశ్వర్లుకు మించిన ప్రొడ్యూసర్ దొరకబోడు,' అనుకున్నాడు రామ్మూర్తి స్వగతం.

రామ్మూర్తి లోపలికి వెళ్ళేటప్పటికి సుభద్ర వేషం విప్పేసుకుంటున్నది.

'ఏమండీ, మా సైడైనా నాటకం రక్తికట్టిందా?' అన్నదామె రామ్మూర్తితో.

రామ్మూర్తికి మబ్బు విచ్చినట్టయింది. మళ్ళీ కాకి ప్రత్యక్షం.

అయితే ఈ కాకికేసి ఏ.తో, ఆత్రుతతో, కళ్ళల్లో సంతకాలు పెట్టుకుని అనేక మంది చూస్తూ ఉండటం రామ్మూర్తి గమనించాడు. కాకి పరిచయం చేసుకోటానికి నాటకవాళ్ళూ అభిమానులు తలపాగాలవాళ్ళూ, మీసాలకు రంగేసిన బట్టతలవాళ్ళూ, వెండి జుట్టు వేసిన క్రాపులవాళ్ళూ స్టేజిలోకి వచ్చారు



సుభద్ర కల్యాణి అభిప్రాయం అడిగింది నాటకం గురించి. కల్యాణి చాలా బాగున్నదని చెప్పింది. రామ్మూర్తి బయల్దేరటానికి ఉపక్రమిస్తున్నాడు.

'రాయపేట హైరోడ్డులో ఒక ఇల్లు తీసుకుంటున్నాం. మనం వేసే నాటకం పూర్తి అయేదాకా మేం మద్రాసు వదలం. ఇక్కడే నాటకం రిహార్సల్స్ చెయ్యాలి. ఇక్కడే మొదటి ఆట ఆడాలి. మీ చెప్పుడన్నా. వీలు చేసుకురండి' అన్నాడు వెంకటేశ్వర్లు.

'మేం రేపు మీ యింటికొచ్చాం గదా. మీరు మా యింటికి రావాలంటే మీరే...... రే పోస్తారా' అన్నది సుభద్ర. రామ్మూర్తి సరేనని తలవూపాడు.

* * *

శ్రీలీలా నాటక సమాజం వారు మద్రాసులో ప్రదర్శించిన గయోపాఖ్యానం గురించి ఘనంగా పత్రికల్లో పెద్దపెద్ద వ్యాసాలు రాశారు. ఆంధ్రవాణి పత్రిక ఆఖరు పేజీలలో రెండున్నర పేజీల ప్రశంస పడింది. కృష్ణ పాత్రధారిణి, సుభద్ర పాత్ర

ధారిణిదీ, వెంకటేశ్వర్లుదీ ఫొటోలు పడినై. వ్యాసకర్త 'మూర్తి' అని సంతకం చేసేశాడు.

ఈ వ్యాసాన్ని చూసి నలుగురూ ఏమనుకుంటారో మనకి తెలీదు. కాని ఇది ఆంధ్రకళా చరిత్రలో ఒక ప్రముఖమైన డాక్యుమెంటు. ఈ 'మూర్తి' అనే పేరు గల రచయిత 'అలగా జనం' కింద పరిగణించవలసిన వ్యక్తులద్వారా ఆంధ్ర నాట్యకళ ఒకమెట్టు పైకెక్కిందని ఒప్పుకున్నాడు. మేటి నటులంతా చెయ్యలేనిపని లీలా నాటక సమాజంవారు ఏదోచేసి ఉండాలి. దాన్ని గురించిన వివరాలు వ్యాసంలో లేవు. 'టీమ్‌వర్క్' అనేమాట ఒకటి రెండుచోట్ల కనిపిస్తున్నది. అంతే!

ఒకవంక సుభద్రలాటి స్టేజితారలు పుట్టి ప్రజాహృదయాన్ని దొంగిలించేస్తుంటే మరోవంక ప్రసిద్ధికెక్కిన నటకులు స్టేజిమీదనుంచి, వేషాలైనా విప్పకుండా, ఆనంద బ్రహ్మనుగురించీ, నాట్యకళను గురించీ ఉపన్యాసాలు దంచేస్తూనే ఉన్నారు. ఈ రెండు పంథాలమధ్యా ఉన్న వైరుధ్యాన్ని విప్పి చెప్పినవారు లేకపోయినారు.

రామ్మూర్తి దగ్గర ఎవరో "మరోప్రపంచం" చదివి వినిపించారు. అతనిలో ఏమీ చలించలేదు. అతని కాపాట వినిపించలేదు. కాని నశించిపోతున్న భావకవితా సంస్కారాన్ని వొదిలి దొరికిన ఆశ్రయాన్ని అందుకునే ప్రయత్నంలో మటుకున్నాడతను.

ఎందుకంటే కలావాణి అమ్మటంలేదు. దానిమీద నెలనెలా నష్టం వస్తున్నది. ముసలాడు దీన్ని ఈ విధంగా ఎంతకాలం పోషిస్తాడు? దీన్నే ఖులాసా కథల పత్రికగా మారిస్తే రెండుమూడువేలు అమ్మవచ్చు. లాభాలు రావచ్చు. నలుగురూ చదివే సాహిత్యం - మంచిదో, చెడదో - ఇందులో వెలువడవచ్చు. కాని అటువంటి మార్పు తెచ్చి తాను కలావాణి సంపాదకుడుగా తెచ్చుకున్న కాస్త కీర్తి పోజార విడవటం రామ్మూర్తికి నచ్చలేదు. "అరాచకమైన అసంస్కారాన్ని" ఆశ్రయించటం రామ్మూర్తికి అభ్యంతరంలేదు కాని అందుకుగాను తన ఖ్యాతి పోగొట్టుకోవటం ఇష్టంలేదు.

"పురజనుల కోరికపై" వెంకటేశ్వర్లు ఆ నాటకాన్ని మళ్లీ ఆడించాడు. ఈసారి డబ్బుకూడా చాలా బాగా వచ్చింది. రాయపేటలో నాటక సమాజంవాళ్ళ లాడ్జి కళకళ లాడసాగింది. రకరకాలవాళ్ళు వచ్చి తమ పరిచయభాగ్యం సుభద్రకు కలుగజేసి వెళుతున్నారు. ఒక వారం రోజులలోపుగా సుభద్రలో మార్పుకూడా కలిగింది. ఆట్టే స్వేచ్ఛగా మాట్లాడటం తగ్గించి మాట్లాడినంత సేపూ "నిర్దుష్టంగా" శిష్టభాష మాట్లాడటానికి చాతగాని ప్రయత్నాలు ప్రారంభించింది.

సుభద్రమీద రామ్మూర్తికి మొదటి ఏవగింపు చాలా తగ్గింది. సంస్కారం లేని మనిషిలో చూస్తున్నకొద్దీ మంచి లక్షణాలు కనిపించటమేకాక సంస్కారం లేకపోవటమే ఒక ఆకర్షణగాకూడా కనిపించటం జరుగుతుంది. సుభద్రవంటిది అసందర్భంగా మాట్లాడితే అది భోళాతనంగా కనిపించేది రామ్మూర్తికి. ఆమెలో నిష్కాలుష్యమూ, అమాయికత్వమూ, అంతులేని సహజత్వమూ, ముగ్ధత్వమూ చూడగలిగాడు రామ్మూర్తి.

అనేకసార్లు సుభద్ర రామ్మూర్తి వెంటపడి బీచికీ, సినిమాలకూ, వాళ్ళింటికీ వచ్చింది. అతను రాస్తున్న నాటకం ఎప్పటికప్పుడు చదివి వినిపించుకునేది. సుభద్రను తాను ఎక్కడికి తీసుకెళ్ళినా భార్యదగ్గర దాచేవాడు కాడు. దాన్నిగురించి భార్యతోగాని మరొకరితోగాని మాట్లాడేప్పుడు తాను సుభద్రకన్న చాలా ఉన్నతమైన తరగతికి చెందినవాడనే విషయమూ, తనకు దాదాపు సుభద్ర యీడు కూతురే వుండవచ్చుననే విషయమూ స్ఫురింప జేయటానికి ప్రయత్నించేవాడు.

కాని ఒక మూల మనస్సులో రామ్మూర్తికి బాధ ఒకటి వుండేది. ఏ కారణం చేతనో, ఏ విధి ప్రోద్బలం వల్లనో సుభద్రకూ తనకూ లంకె పడుతుందని ముందుగానే భయపడి అటువంటిది చాలా అసంగతమనీ, తన ఆదర్శాలకు ఎంతమాత్రమూ కుదిరే విషయం కాదనీ తనకు తాను తీవ్రంగా నచ్చ చెప్పుకునేవాడు ఒక్కొక్కసారి ఈ మనోవ్యాపకంతో గంటలకు గంటలు హరించుకుపొయ్యేవి. ఇంకో మూల అతని మనస్సులో మరో బాధకూడా వుండేది. సుభద్ర తన ప్రేమకోసం నిరీక్షిస్తున్నదనీ, తాను ఎంతకీ చలించకపోవటం చూసి లోపల ఆశ్చర్యపడుతున్నదనీ, తిట్టుకుంటున్నదనీ అనిపించేది. నీతి నియమాలూ, సంస్కారాదర్శాలూ లేని నవయవ్వనంలో వున్న తక్కువ జన్మగల పిల్లయొక్క మనస్తత్వం ఊహించుకోవటానికి ప్రయత్నించి రామ్మూర్తి బెదిరిపోయినాడు.

ఒక్కొక్కసారి సుభద్రమీద — ముఖ్యంగా ఆమె దగ్గరలేని సమయాల్లో — చెడ్డకోపం వచ్చేది. తనవంటివాణ్ణి కామించటానికా పశువుకేమధికారం వుంది? ఏం నెపదనుకుంటున్నది?

అయితే ఈ కోపం రామ్మూర్తి మనస్సును మెత్తబరచటానికెంతో వుపయోగపడేది. ఆమె మాత్రం తనవంటి మనిషికాదా? తనకున్న క్షుధలు ఆమెకుండవా? అదీకాక — ఇది ముఖ్యమైన విషయం — ఈ సుభద్రకి కార్లూ, సిల్కు సూట్లూ, డబ్బూ, నగలూ అర్పించటానికి సిద్ధంగా వున్న గౌరవనీయులెంతోమంది వున్నారు.

రంకుతనమనేది — ముఖ్యంగా స్వేచ్ఛా జీవనం గల స్త్రీలతో రంకుతనం — పరిపాటిగా జరుగుతూవున్నదే. దాన్ని గురించి సంఘం ఏమీ పట్టించుకోవటం లేదు. దాని మూలంగా సాంఘిక విప్లవాలూ, సంక్షోభలూ జరగటంలేదు. ఆ పరిస్థితిలో రామ్మూర్తి, తాను సుభద్రతో రంకుతనం చెయ్యటమనేది ఒక బ్రహ్మాండమైన విషయంగా ఎందుకు పరిగణించాడో ఊహించలేం. కాని అతనా విధంగా భావించిన మాటమాత్రం యధార్థం. సుభద్ర కతనిచ్చిన విలువకూ ఆమెతో రంకుతనం చెయ్యటానికి తను పడ్డ బాధకూ ఎక్కడా సమన్వయంలేదు.

ఈ విధంగా ఆరునెల్లు గడిచింది.

ఇప్పటికి మూడునెల్లనుంచీ సుభద్ర మనస్సు రామ్మూర్తికి స్పష్టంగానే తెలుసును. ఇప్పటి కయిదు నెల్లనుంచీ రామ్మూర్తికీ సుభద్రకూ సంబంధం వుందని పట్నంలో అందరూ — ఇటువంటివి అనుకోవటంలో ఆసక్తి కలవా రందరూ — అనుకుంటూనే వున్నారు. ఇప్పటికి పదిహేను రోజుల్నుంచీ రామ్మూర్తి ఇల్లు ఖాళీగానే ఉంది — వాళ్ళ నాన్నగారికి ఒంట్లో సుస్తీగా ఉందనీ, ఆయన యీసారి మంచంలోనుంచి లేవటపోవచ్చుననీ తెలిసి, నాలుగో మాసం గర్భిణిలోనే కల్యాణి పుట్టింటికి వెళ్ళింది.

రామ్మూర్తి రాస్తున్న నాటకం క్రిందటిరాత్రే పూర్తయింది.

"ఇవాళ సాయంకాలం అందరూ మా యింటికి రండి, చదివి వినిపిస్తాను." అన్నాడు రామ్మూర్తి.

"ఇవాళ సాయంకాలం నేను సినిమాకు పోవాలి" అన్నది సుభద్ర. వారంరోజుల కింద విడుదలైన నాటకం అడివచ్చిన తరవాత సుభద్ర సినిమా మోహం ఎరగదు రామ్మూర్తికి తప్పలేదు. సుభద్రను వెంటపెట్టుకుని సినిమాకు వెళ్ళాడు. సినిమా కాగానే పక్కనే హోటల్లో ఇద్దరూ భోంచేశారు.

"మీ యింటికి పోయి నాటకం చదువుదామా?" అన్నది సుభద్ర. కల్యాణి ఊళ్ళో లేదని సుభద్రకి తెలుసు.

రామ్మూర్తికి శ్వాస పీల్చటం చాతకాలేదు. ఒణుకుతున్న గొంతుతో హీన స్వరంతో "పద" అన్నాడు.

టెక్నికల్‌గా సుభద్ర తప్పేమీలేదు. ఆమెకు సంస్కారం లేకపోవచ్చు. నైతిక దృష్టికూడా లోపించవచ్చు. కాని ఈ విషయంలో ఆమె కర్తృత్వం ఏమీలేదు. ఒకవేళ రామ్మూర్తి వంటి సత్పురుషు డానాటి రాత్రి కాలుజారి పెద్దపాటు పడ్డాడని ఎవరైనా అనుకునే పక్షంలో ఆ పతనానికి హేతుభూతమైన బాహ్య ఉపకరణాలన్నీ



అతనే తెచ్చుకున్నాడు. ఆమె అతనికిచ్చిన ప్రోత్సాహంకూడా ఏమీలేదు – అతను తనమీద చెయ్యేసినప్పుడు, "ఏంటబ్బా!" అని మూలగటం తప్ప.

అయిదారు నెల్లు పస్తాయించి ఆఖరుకు ఈపని కాస్తా చేసేసిన తరవాత ప్రపంచం తారుమారు కాకపోవటమూ, సూర్య చంద్రాదులు గతులు తప్పకపోవటమూ చూసి అతను చాలా సంతృప్తి చెందాడు. ఒక రాత్రివేళ అతను సుభద్రా సమేతుడై డాబా మీదికి వచ్చి చూసేసరికి నక్షత్రాలన్నీ రెట్టింపు కాంతితో వెలుగుతున్నట్లు కనిపించింది. వాయుదేవుడుకూడా సానుభూతితో వీచాడు.

అయితే అతనిలో కలిగిన మార్పేమిటంటే అతని కొక నూతనానుభవం కలిగింది. అదివరకే స్త్రీ శరీరంకూడా అతనికింత సన్నిహితంగా కాలేదు. రాత్రి

తనకూ భార్యకూ మధ్య కొంత సంస్కారం, మర్యాద, ఎప్పుడూ అడ్డం ఉండ నిచ్చాడు. ఏ కించిత్తు నిగ్రహమూ మనిషిని జంతువులనుంచి వేరు పరుస్తుందో దాన్ని అతనుగాని కల్యాణిగాని ఎప్పుడూ జారవిడవలేదు. ఈ సుభద్ర తన దగ్గర ఏమీ దాచుకోలేదు. అంతా ఇచ్చేసింది! కల్యాణి ఏదో దాస్తూనే వచ్చింది – లేక ఆమెకు అంతా ఇచ్చేయటం చాతకాలేదో? ఏమంటే, అదీ ఒక కళ–కాదు, అదే నిజమైన ప్రేమ. నిజమైన ప్రేమ యీ సుభద్రకు తెలిసినట్టుగా తన భార్యకు తెలియదు...ఇది స్వచ్ఛందమైన ప్రేమ. తనవల్ల యీ సుభద్ర కేం ప్రయోజనం? ఏమీలేదు. తనకంటె ఎక్కువ ఆత్రపడినవాళ్ళని ఎంతమందిని కాదని తన దగ్గరికి వచ్చింది? దీనికేం కారణం చెబుతాం? ఏమీలేదు, నిష్కల్మషమైన ప్రేమే.

ఈ విధంగా వెళ్ళింది రామ్మూర్తి భావన. అతని పరిభాష – మనిషి మనిషికి అంతా ఇచ్చేసుకోవటమూ, అవ్యాజంగా అజ్ఞాతంగా పుట్టుకొచ్చే ప్రేమా – అందరికీ అర్థం కావటం కష్టం. దానికికూడా కొంత సంస్కారమూ, కొన్ని ఆచారాలూ తెలిసి వుండాలి.

కిందటిరాత్రి సుభద్ర ఒంటరిగా రామ్మూర్తితో గడిపిందని మర్నాడు ఉదయానికి లాడ్జిలో అందరికీ తెలిసింది. సుభద్ర స్నేహితురాలు మర్నాడు సుభద్రను చూడగానే ప్రశ్నార్థకంగా తల ఆడించింది. సుభద్ర నవ్వుతూ కన్ను మలిపింది.

సుభద్ర రామ్మూర్తి స్నేహం గురించి గర్వించకపోలేదు. ఆమె "పెద్ద మనుషుల్ని" బొత్తిగా ఎరగని మొహంకాదు. కాని రామ్మూర్తివంటి "కష్టమైన" మనిషి ఆమెకు వెనక తగల్లేదు. అదీకాక రామ్మూర్తి సంస్కారాన్ని నిజంగా మెచ్చుకోగలిగిన మనిషి సుభద్ర. తనతో పని అయిపోగానే పెద్ద విజయం సాధించినవాడి మొహం పెట్టలేదు రామ్మూర్తి. అతను తనను నిజంగా మర్యాదగా చూచాడు. మగజాతిమీద సుభద్రకు గౌరవం అంతో ఇంతో రామ్మూర్తి మూలంగా హెచ్చిందని చెప్పాలి.

ఎంతో కాలంగా నీటిని చూసి భయపడుతున్నవాడికి ఈత వచ్చినట్టయింది రామ్మూర్తికి. లోకం ఏమీ మార్పుచెందలేదు సరేకదా, తనపట్లకూడా ఏమీ మారలేదు. అందరూ తనతో మామూలుగానే మాట్లాడారు. అందులో కొందరు తనను అయిదారు నెల్లనుంచీ శంకిస్తున్నవారే గనక ఇవాళ ఆకస్మాత్తుగా మారే అవకాశంలేదు. ఒక్క వెంకటేశ్వర్లే, ఒకనాడేదో మాటల సందర్భంలో రామ్మూర్తి సుభద్రను గురించి చాలా మెత్తగా మాట్లాడుతుంటే, "ఆఁ, చచ్చుముండ, దాని దేముల్లెండి?" అన్నాడు, దాన్ని పెద్ద చెయ్యవద్దని సూచనగా.

రామ్మూర్తి మాదిరిగా ఎవరన్నా పర స్త్రీ - ముఖ్యంగా నీచ స్త్రీ - సంపర్కం తెచ్చుకున్నప్పుడు, ఆ వ్యక్తి వ్యభిచారి అయిపోయి అడ్డమైన ఆడవాళ్ళతోటి సంపర్కం పొందటానికి అర్హుడైనట్టుగా భావించటం లోక రివాజు. రామ్మూర్తి ఒక్కనాటికీకూడా అట్లా అయిపోలేదు. సుభద్ర అతనికి సన్నిహితురాలయిందిగాని ప్రపంచంలో ఉన్న ఇతర స్త్రీ లందరూ అతినికి ఎప్పటి దూరంలోనే ఉన్నారు. రామ్మూర్తివంటి వ్యక్తి పతనం కావటంలోకూడా ఉదాత్తత కోల్పోడు. అతను ఒకతె స్థానం తీసుకుపోయి మరొకతెకు ఇవ్వలేదు. అతని భార్య ఆక్రమించలేని స్థానంమీద సుభద్రకు పట్టం కట్టాడు.

ఈ విషయంకూడా త్వరలోనే రుజువయింది. వాళ్ళ నాన్నగారికి కొంచెం నెమ్మదిగానే ఉందనీ ఒకసారి పండగకు అక్కడే ఉండి వెళ్ళిపోవలసిందనీ కల్యాణి ఉత్తరం రాసింది. రామ్మూర్తి వెంటనే భార్యకోసం పద్ధెనిమిది రూపాయలు ఖరీదు గల బెంగుళూరు సిల్కుచీరె ఒకటి కొని బయలుదేరాడు. తన భర్తను చూసి కల్యాణి ఏమీ మార్పు కనిపెట్టలేదు. "నీ భర్త మరొకతెను మరిగా"డని చెబితే ఆమె నమ్మి ఉండదు.

రామ్మూర్తి తనమీద మామూలుకన్న ఎక్కువ ఆపేక్షగా ఉన్నట్టుకూడా గుర్తించింది. దానికి కారణం లేకపోలేదు. రామ్మూర్తి అంతరాత్మ అకస్మాత్తుగా అతన్ని ఎదిరించి, "ఈమె నీ అర్ధాంగి. ఆవిడకు తెలీకుండా నువ్వీమధ్య చాలా ఆనందం అనుభవించావు. ఆమెకు అత్యాచారం చేశావు. నీ ఆనందం కొంత యీవిడ క్కూడా పంచు," అని శాసించింది.

* * *

పశ్చాత్తాపం రిహార్సల్సు ప్రారంభమయినై. పాటలు రాయటమూ మట్లు పెట్టటమూ అయిపోయింది. గ్రామఫోను రికార్డుల ధర్మాన మట్లుపెట్టటం ఏమంత పనికాదు.

కొన్నిరకాల క్రిములు కొన్నిరకాల శరీరజాడ్యాల ఆస్కారం చూసుకుని విజృంభించినట్టు సంఘంలో ఉన్న కుసంస్కారాన్ని ఆశ్రయించి వెంకటేశ్వర్లువంటి వాళ్ళు తమ తెలివితేట లుపయోగించుకుంటారు. సంగీతంలోనూ, కవిత్వంలోనూ అతనికున్న పాండిత్యం కళాదృష్టి కలవాడికి జుగుప్స కలిగిస్తుంది. కాని వెంకటేశ్వర్లును సంఘం బతకనిస్తుంది, పెరగనిస్తుంది.

రిహార్సల్సు చేయించటమంటే వెంకటేశ్వర్లు ఉద్దేశంలో పాటలు నలగగొట్టించటం. వాచకం విషయంలో గంటసేపు శ్రమపడితే నటులు సంగీతం విషయంలో

అయిదారు గంటలు శ్రమపడాలి. పత్తికట్టేవి పాటలు. ప్రేక్షకులు వన్సుమోరు కొట్టేది పాటలకోసం.

రామ్మూర్తి ఊరికి వెళ్ళకపూర్వమే రిహార్సల్సు ప్రారంభమైనప్పటికీ, అతనికి తన సంభాషణలు నటులనోట వినే అవకాశం కలగలేదు. అతను తిరిగి వచ్చినాక ఈ సదవకాశం లభించేసరికి అతనికి మతిపోయినట్లయింది.

అందరూ సంభాషణలని తగలేస్తున్నారు. అందరికన్న రెండాకులెక్కువ చదివినట్టు కనబడ్డది సుభద్ర. ఒక్కరికీ వాచకం శుద్ధంగాలేదు. అందరికీ దిక్కుమాలిన యాస. గ్రాంధికంలో సంభాషణలు దంచేసినవాళ్ళంతా చక్కని నోటిమాటలు గల వాడుకభాష నెందుకు తగలేస్తున్నట్టు?

'ఏమిటీ ఘోరం?' అన్నాడు రామ్మూర్తి.

'నేను మొదటనే చెప్పలా, మాష్టారూ? ఈభాష వాళ్ళకు తెలీదండీ! వాళ్ళేమిటి? రేపు ఆడియన్సు కసలర్థంకాదు నామాట నమ్మండి!' అన్నాడు వెంకటేశ్వర్లు.

వెంకటేశ్వర్లుది తప్పని రుజువు చెయ్యటానికి రామ్మూర్తి రెండు మూడు వాక్యాలు గ్రాంధికంలోకి మార్చి నటుల చేత అనిపించాడు. వెంటనే వాళ్ళవాచకంలో మార్పు కనిపించింది. చెవికి కటువుగా తోచటం పోయింది. వెంకటేశ్వర్లు ఎప్పుడైనా తప్పు చెబుతాడా? వాడు అపరబ్రహ్మ. వాడి నోటవచ్చింది వేదవాక్కే.

రెండురోజులు కూర్చుని రామ్మూర్తి సంభాషణలన్నీ కృతకభాషలోకి మార్చేశాడు. నటులంతా నిట్టూర్చారు. రిహార్సల్సు సాగినై.

మరోనెలకల్లా నాటకం ప్రదర్శనోన్ముఖమయింది. రామ్మూర్తికీ నాటకంతోగల సంబంధాన్ని పత్రికలు కొంతవరకు ప్రచారం చేసినై. మొదటి ప్రదర్శనం పట్నంలోనే జరిగింది. అనేకమంది పెద్దలాహ్వానింపబడ్డారు. 'పశ్చాత్తాపం' మొదటి ప్రదర్శనలోనే విజయవంతమయింది.

వెంకటేశ్వర్లు దేశసంచారానికి ప్లానులు వేశాడు. రామ్మూర్తికిప్పుడు కారేర్పడింది. వెంకటేశ్వర్లిచ్చిన అయిదువందల రూపాయలతో అతను సెకండుహేండ్ ఆస్టినుకారు కొనుక్కున్నాడు. ఆ కారులో సుభద్రను వేసుకుని నాటకం ఆడుతున్న చోటికల్లా కారుమీదే రామ్మూర్తి ప్రయాణం అయిపోతూండేవాడు. ఎందుచేతనంటే మిగతాట్రూపువెంట సుభద్ర వెళ్ళలేదు. మద్రాసులో లాష్టి ఎత్తేసినప్పటినుంచీ రామ్మూర్తిపనీ సుభద్రపనీ బాగుంది. సుభద్రను కాస్త ముస్తాబుచేసి బహిరంగంగా వెంటతిప్పాడు, రామ్మూర్తి. ఈతిప్పటంలో లోకం తన కళాభిరుచిని

మాత్రమే చూస్తున్నదని అతనివిశ్వాసం. ఇప్పు డతనిదగ్గర సిగిరెట్టుటిన్ను విడవకుండా వుంటున్నది. అది ఒక్క రామ్మూర్తి సొత్తేకాదు. ఎవరూ చూడనప్పుడు సుభద్రకూడా సిగిరెట్లు నుసిచేస్తూ ఉండేది.

కళావాణిపత్రిక ఇంకా నడుస్తూనే ఉంది, రామ్మూర్తి ఇంకా దాన్ని చూస్తున్నాడు. అతని కిప్పటికీ జీతం ముట్టుతూనేవుంది. కాని ఇటీవల దాని ధోరణి మారింది. అందులో అన్నికళాల వ్యాసాలూ పడుతూవున్నై, పత్రిక అమ్మకంకూడా కొద్దిగా పెరిగింది. వెనకటంతగా నష్టం రావటంలేదు.

మరోవంక రామ్మూర్తి ప్రఖ్యాత నాటకకర్త అయిపోతున్నాడు. అతని రచన మీద ఇప్పుడు అభిప్రాయాలిస్తున్నది, పదేళ్ళక్రితం సాహిత్యంమీద అభిప్రాయాలిచ్చినవాళ్ళుకారు. ఇప్పు డభిప్రాయాలిచ్చినవారికి విమర్శనాసూత్రాలు లేవు. వీరు నాటకంచూస్తారు. ప్రదర్శనం వారికి నచ్చితే ఆ నాటకంతో సంబంధంగల వారందరికీ ఇంతింత కీర్తి పడేస్తారు. లేనిపక్షంలో అందర్నీ చెడతిడతారు.

రామ్మూర్తి రాసిన "పశ్చాత్తాపం" అనే నాటకంలో ప్రతిభ ఏమీలేదనీ, అతను అసలు నాటకంరాసే అర్హతే లేదనీ పత్రికాముఖంగా అన్నవాళ్ళు లేకపోలేదు. కాని వారి విమర్శలు నాటకప్రదర్శనంయొక్క విజయానికిగాని రామ్మూర్తిపేరు వ్యాప్తి చెందటానికిగాని అడ్డేమీ రాలేదు. అతను తన రెండో నాటకంకూడా రాయటం ప్రారంభించాడు.

ఈ స్థితిలోకూడా రామ్మూర్తి తన పాత సంస్కారాన్ని పూర్తిగా వొదులుకోలేకపోయినాడు. తన మొదటి నాటకాన్ని ప్రజలు ఆదరిస్తున్నారని తెలియగానే అతను నాటకరచనమీద వ్యాసాలు రాయటం మొదలుపెట్టాడు. నాటకరచన ఒక కళ అనీ, అది ఉత్తమ కళకూడాననీ ఘట్టిగా నొక్కి వక్కాణించాడు. మనదేశంలో ఈకళ ఇంతకాలమూ మృగ్యంగా వుండి ఇప్పుడిప్పుడే చిగుర్చుతున్న దన్నాడు. దిఙ్మాత్రంగా తాను నాటకరచనలో కెట్లా దిగిందీ చెప్పాడు. ఇక ముందుముందు ఆంధ్రదేశంలో ఏమిటి, భారతదేశంలో ఏమిటి, ప్రపంచంలో ఏమిటి మిగతాకళలు వెనకపడిపోయి నాటక కళే మిగులుతుందని జోస్యం చెప్పాడు. ఏమంటే నాటకంలో అన్నికళలూ వున్నై. కథవున్నది, కవిత్వం వున్నది. పాత్రధారణలో చిత్రకళ వున్నది. పాటలలో గానకళ వున్నది. అభినయంలో నాట్యకళా వున్నది. నాటకరంగంమీద ప్రవేశపెట్టటానికి వీలులేని లలితకళలేదు. వుండబోదు...ఈ ధోరణిలో; రామ్మూర్తి గొప్ప నాటకకర్త అనే విషయం ఈ వ్యాసాలు చదివినవారికి రూఢి అయిపోయింది...

కాలక్రమాన కల్యాణికి ఆడపిల్ల కలిగింది. త్వరలోనే ఆమె పిల్లతోసహా పట్నం వచ్చేసింది. ఆమె రాగానే రామ్మూర్తి స్వేచ్ఛ కొంతభాగం కట్టుపడిపోయింది. సుభద్రతో అతనికి గంటలకు గంటలు గడిపే అవకాశంలేదు. అదివరకల్లా లేనిబాధ ఇప్పుడు మరోటి పట్టుకుంది అతనికి. అదేమిటంటే, తన పరిశ్రమవల్ల సుభద్ర ఇప్పుడు కొంతవరకు నలుగురి ఎదటికీ పోదగ్గ మనిషిగా తయారయింది. అందువల్ల ఆమెకోసం జనం మరింత ఎగబాకుతున్నారు. ఎప్పుడో ఒకప్పుడు ఎవడో ఒకడు దాన్ని ఎగరేసుకుపోక తప్పదు. ఎప్పుడెవరే బహుమానాలిచ్చినా పుచ్చుకుంటున్నది. పౌడరుడబ్బీలూ, చీరెలూ, ఉంగరాలూ వస్తున్నై. తనుకూడా చెప్పి చూశాడు. "ఇవాళ ఉంగరం ఇచ్చినవాడు రేపు నీచెయ్యి అడగడా? ఎందుకు లేనిపోని మొహమాటాలు తెచ్చిపెట్టుకోవటం?"

సుభద్ర వినలేదు. వాళ్ళు సంతోషంగాదీ ఇస్తుంటే తనూ సంతోషంతోనే పుచ్చుకుంటున్నా నన్నది.

ఇప్పుడు సుభద్ర వేరే ఇల్లు తీసుకుని ఉంటున్నది. ఎవరుపడితే వాళ్ళు వచ్చిపోతూ వుంటారు. రావలా రాయటానికి తనకు ఓపికలేదు. అవకాశం అంతకన్నాలేదు. మామూలు ప్రకారం నాటకాలు పడ్డప్పుడు వెళ్ళి వేసి వస్తున్నది.

సుభద్రను మద్రాసునుంచి పంపేసి ట్రూపు పెంచుకుందే ఏర్పాటు చేద్దామని చూశాడు రామ్మూర్తి కాని సుభద్రకు కోపం వచ్చింది. "ఇప్పుడు మీ ఆవిడ వచ్చిందిగనక నాతో అక్కర తీరిందా? నాకసలు ట్రూపూ అక్కర్లేదు. నాటకాలూ అక్కర్లేదు. హాయిగా ఏ సినిమా కంపెనీలో చేరినా రాజా వల్లే గడుస్తది!" అని బెదిరించింది.


"ఏ సినిమావాళ్ళన్నా రమ్మంటున్నారా?" అన్నాడు రామ్మూర్తి.

"పనికి రానేట్లా?" అన్నది సుభద్ర.

"పనికొస్తావులే. మాటవరసకి అడిగాను,"

"మరిక నేం?... ముష్టి పౌండరూపాయలకి ఊళ్ళూళ్ళా ఎవరు తిరుగుతారయ్యా ఓ పట్టునపడుండకా? మా అమ్మను పిలుస్తున్నా! ఇక నేనీవూరు కదల్ను."

రామ్మూర్తి చేసేదేమీ కనిపించలేదు. అతని అసలు రోజులు బాగాలేవు. కలావాణి ఆ పేద్దాసని ముసలాయన అన్నాడు. దాన్నెవరో నగలవర్తకుడు కొంటా నన్నాడు రామ్మూర్తి ఆ నగలవర్తకుడి దగ్గరికి పరిగెత్తి తననే పత్రిక చూస్తూ వుండనిమ్మన్నాడు. అందుకు మొదట తనకు మరొకరున్నా రన్నాడు. ఆ తరవాత తాను యాభైమాత్రమే ఇవ్వగలనన్నాడు. పౌరుషానికి రామ్మూర్తి మరొకర్ని చూసుకోమని చికాకుపడిన మనస్సుతో కారెక్కి సుభద్ర ఇంటికొచ్చాడు.



సుభద్ర ఎవరితోనో చాలా సరదాగా మాట్లాడుతున్నది. పిచ్చెత్తినవాడల్లే రామ్మూర్తి లోపలికి వెళ్ళాడు. లోపల ఆకుపచ్చకోటూ, నల్లగీరల లాగూ వేసుకుని ఒక కుర్రాడున్నాడు. ఆ కుర్రాడు రామ్మూర్తిని చూస్తూనే బయటికి జారుకున్నాడు.

"వీడెవడు ?" అన్నాడు రామ్మూర్తి.

"ఎవరో జమీందారుగారి బంధువంట," అన్నది సుభద్ర.

"ఏ జమీందారు ?"

"ఏమో ఎవరికి తెలుసు ?"

"ఏం పనిమీదొచ్చాడు ?"

"ఈనా ? సినిమాసంగతి మాట్లాడ్డానికొచ్చాడు ."

"ఏం సినిమా ?

"ఆ జమీందారుగారు సినిమా పెడతాడంటగా ?"

రామ్మూర్తికి ఒళ్ళు మండిపోయింది. సుభద్రమీద అతనికింత కోపం ఎన్నడూ రాలేదు. బాగా తిట్టేశాడు. కుక్కకుండే విశ్వాసంకూడా లేదన్నాడు. ఎక్కడో మురుగులో పొర్లాడే పందినితెచ్చి తనూ వెంకటేశ్వర్లూ కలిసి పైకిలాగి ఒక మనిషిని చేసినందుకు ఇప్పుడు తను సొంతలాభం చూసుకోవటమేనా చేసేదని అడిగాడు.

సుభద్ర ఏడిచింది. ఈ పాడునాటకాలు తనకిక వొద్దన్నది. హాయిగా సినిమాలో చేరిపోతానన్నది.

"నీ సంగతితప్ప ఇంకోరిసంగతి చూడలేవా ?" అన్నాడు రామ్మూర్తి

"మీ కేంటయ్యా ? మీరింతా నాబోటి పందుల్ని పట్టుకొచ్చి మనుషుల్ని చేస్తారు. ఇంకెవరిన్నా పందుల్ని చూడరాదా ?" అన్నది సుభద్ర.

రామ్మూర్తి కళ్ళనీళ్ళ పర్యంతం అయినాడు. పత్రిక పోయింది. సుభద్ర మానేస్తే నాటక కంపెనీకూడా పోయినట్టే.

'నేనిట్లాగే నాటకాలు రాస్తే వెంకటేశ్వర్లు డబ్బిస్తాడేమోగాని నువులేని కంపెనీకి నేను రాయను," అన్నాడు రామ్మూర్తి.

సుభద్రకి జాలేసింది. ఇంత సంస్కారంగల రామ్మూర్తికి, పందుల్ని పంకిలంలో నుంచి పైకిలాగి మనుషుల్నిచేసే రామ్మూర్తికి, ఎన్నడూ ఎవరిమీద కలగనంత జాలి అతని మీద సుభద్రకి కలిగింది. మిగతా విషయాలు సుభద్రకి తెలీకపోవచ్చుగాని రామ్మూర్తివంటివాడికి డబ్బు లేకపోవటమంటే ఏమిటో ఊహించుకునే శక్తి ఉంది.

రామ్మూర్తి తల రొమ్ము కానించుకుని, 'నువుకూడా సినిమా కంపెనీలోకి రావే! నువు లేకుండా నేను పోనుగా, సరేనా ?' అన్నది. ఈముక్కతో రామ్మూర్తి ఆరాటం తగ్గినా ఆనందం ఇవ్వలేదు. తనకు ఆర్థికదుస్థితి కలగటమూ అది ఈ మనిషిద్వారా పరిష్కారం కావటమూ అతని ఆత్మగౌరవానికి రుచించలేదు. కాని ఈపద్ధతి బాగుంది. తను వెంటఉంటే సుభద్రకు క్షేమం. లేకపోతే ఈ జమీందార్ల నెవడు నమ్మాడు ?

* * *

సుభద్ర అన్నమాటమీద నిలబడింది. కవిగా రామ్మూర్తిని తీసుకుంటే తప్ప తను రానన్నది. జమీందారుగారి ఏజెంటు నయానా భయానా చెప్పిచూశాడు. వ్యవహారం తెగలేదు. ఏమాటా చెప్పకుండా శలవు పుచ్చుకున్నాడు. సుభద్ర బెదరలేదు.

మర్నాడు ఏజెంటు మళ్లీ వచ్చాడు. ఇద్దర్నీ తీసుకోవటానికి జమీందారుగారు ఒప్పుకున్నారు. రామ్మూర్తి రాగానే గట్టిగా వాటేసుకుని ఈ శుభవార్త చెప్పింది.

"ఇవాళ సాయంకాల ఆరింటికి మనం కార్లో రాజాగారి బంగళాకు వెళ్ళి కంట్రాక్టు మీద సంతకాలు చేద్దాం. ఏం?"

నెలకు అయిదువందల జీతంమీద సుభద్రనూ, పిక్చరుకు వెయ్యిరూపాయల లెక్కన రామ్మూర్తినీ బుక్ చెయ్యటానికి రాజాగారు సంసిద్ధులైనారు. రామ్మూర్తి సంతకంచేసి ఉండేవాడే. సుభద్ర అడ్డంపడి రామ్మూర్తికి నెలజీతం ఏర్పాటుచేస్తేగాని ఒప్పనన్నది. జమీందారు ఎదట ఎంత గౌరవమర్యాదలు చూపాలో తెలీక సుభద్ర రామ్మూర్తికి మేలుచేసింది. లేకపోతే రాజాగారి ఉద్దేశం రామ్మూర్తిని ఒక నెలలో వదలగొట్టుకుందామని. దేవుడా అంటూ రామ్మూర్తికి నెలకు రెండువందలయాభై చేసి కంట్రాక్టు రాశాడు.

ఈ కార్యపనీ పూర్తిచేసుకుని, సుభద్రను ఇంటిదగ్గర దింపి రామ్మూర్తి ఇంటికి వచ్చాడోలేదో, రాజాగారి కారు వచ్చి సుభద్రను రాజాగారింట రాత్రికి భోజనానికి పిలుచుకుపోయింది. ఇంటిదగ్గర రామ్మూర్తిని చూడగానే కల్యాణి బావురుమన్నది.

అతను ఎవతెనో తగులుకున్నాడని ఆమధ్యాన్నమే ఎవరో పనిపెట్టుకొచ్చి కల్యాణితో చెప్పి వెళ్ళాడు.

రామ్మూర్తి వచ్చి అబద్ధం అనేశాడు. అంతా ఉత్తదన్నాడు. ప్రమాణాలుకూడా చేశాడు. అసలా మనిషి వేషాలువేసే మనిషన్నాడు — వేషాలువేసేవాళ్ళతో ఎవరూ సంబంధాలు పెట్టుకోనట్టు.

కల్యాణి అనుమానాలన్నీ తీరిపోయినై. కన్నీళ్ళలోనుంచి నవ్వింది.

కాని మిగిలినప్రపంచం అనుమానాలు మరింత దృఢమైనై. అనామకుడుగా ఉన్న ఒక పత్రికా సంపాదకుడు ఎవరో చక్కనిదాన్ని పట్టుకుని సినిమాల్లోకి వచ్చి గొప్పవాడైనట్టు చెప్పుకోసాగారు.

తాను పైకొచ్చినట్టు రామ్మూర్తిమటుకు భావించనేలేదు. ఈ సినిమాకంపెనీలోకి రావటం అతని ప్రాణానికి అధఃపతనంగానే ఉంది. ఈ సినిమాలోకం ఒక మహా ప్రపంచం. ఇందులో సంస్కారమనేది ఏమూలా కనిపించలేదు. 'బాలు' అనే పేరు గలవా డొకడు — జమీందారుగారి భృత్యుడు — రామ్మూర్తిని చాలా నీచంగా తృణీకరించి చూడసాగాడు. రామ్మూర్తికి పెద్దకోపం వచ్చింది. వెళ్ళి రాజాగారితో రిపోర్టుచేశాడు. 'నీపని నువ్వు చూసుకో' అని రాజాగారు సలహా ఇచ్చారు.

అక్కడే చిక్కొచ్చింది. అతనికి చేసేటందుకు పనేమీలేదు. కాని అతను


ఏ సమయాన లాడ్జిలో లేకపోయినా బాలు నానామాటలూ అనేస్తాడు. 'ఉంది నన్నేం చెయ్యమన్నావు?' అని అడిగితే 'నన్నడక్కు రాజాగార్నడుగు,' అంటాడు. ఆఖరుకు విసుగెత్తి రామ్మూర్తి రాజాగారిదగ్గరికి వెళ్ళి 'నాకేదన్నా పని ఇప్పించండి' అని అడిగితే సాయంకాలం అయిదింటికి మాట్లాడదామనీ, మర్నాడు పదింటికి మాట్లాడదామనీ రాజాగారు వాయిదాలు వేస్తూ వచ్చాడు. సుభద్ర ప్రోద్బలంవల్ల తనకు జీతం ఇస్తున్నారేగాని తనతో కంపెనీకి ఏమీ పనిలేదు. 'నువు మాకక్కర్లేదు,' అని రోజుకు నాలుగుసార్లు కంపెనీవాళ్ళు అతనికి జ్ఞాపకం చేస్తూనే ఉన్నారు. ఈ విధంగా ఒక సంవత్సరం గడవాలి. తను దిక్కుమాలిన కంట్రాక్టు సంవత్సరం ఉంది. ఈ లోపుగా కాంట్రాక్టు చించేసి తను వెళ్ళిపోతానంటే మహారాజుగా వెళ్ళమంటాడు. ఒక్కొక్కరోజు మరీ రోషపుట్టి అంతపని చేద్దామనిపించేది.

ఈ బాధతోపాటు సుభద్ర చెయ్యి జారిపోయిందనే బాధకూడా రామ్మూర్తిని బాధించింది. ఆమెకు చక్కగా మేకప్‌చేసి స్టూడియోలో స్టిల్సుతీయించి పత్రికలమీద ముఖ చిత్రాలుగా వేయిస్తున్నారు, రైటప్స్ రాయిస్తున్నారు. ఆమెనుగురించి జిజ్ఞాసువులు ప్రశ్నలు వేస్తుంటే పత్రికాధిపతులు జుగుప్సాకరమైన సమాధానాలిస్తూ, ఆమెకూ రాజాగారికీ లంకె పెడుతున్నారు. ఇదంతా మరి రామ్మూర్తికి బాధగానే ఉంది.

అంతకంటె బాధగా ఉంది ఆమెను అతను వారాలతరబడి కలుసుకోలేకపోవటం. ఆమె ఇల్లు మారినట్టు తెలిసింది. ఒకరోజు కార్లో వెళ్ళిచూస్తే ఇల్లు తాళం పెట్టి ఉంది. మరోసారి వెళ్ళిచూస్తే ఇంకెవరో ఉన్నారు. చివరకామె ఇల్లు తెలుసుకుని అతను ఒకనాడు వెళ్ళితే మేడ కిందిహాలులో ఒక వృద్ధాంగన కనిపించింది. 'సుభద్ర ఉండే ఇల్లు ఇదేనా?' అని అడిగితే, 'ఎవరు నువ్వు?' అన్నది. పేరువిని ఏం కావాలనడిగింది. సుభద్రతో మాట్లాడాలంటే 'ఏం మాట్లాడా' అన్నది. సుభద్ర తనకు పరిచయస్థురాలేనని చెప్పిన తరవాత ఆమె ఇంట్లోలేదనీ, ఎప్పుడొస్తుందో తెలీదనీ చెప్పింది. రామ్మూర్తి వచ్చినదోవ పట్టక తప్పిందికాదు. కాని అతను కారెక్కి ఇరవై గజాలు వెళ్ళాడోలేదో రాజాగారి కారు ఎదురువచ్చింది. అతను కారులో ఎవరున్నారనేది చూసి తన కారు పక్కకాపించి వెనక్కుతిరిగి చూశాడు. కారు సుభద్ర ఇంటిముందాగింది. రామ్మూర్తి కొంతదూరం వెళ్ళి ఏదో ఆలోచన వచ్చి తన కారునుతిప్పి సుభద్ర ఇంటికేసి పట్టించాడు. అతను అంతదూరంలో ఉండగానే రాజాగారి కారు సుభద్ర ఇంటిముందునుంచి బయల్దేరివస్తూ ఎదురయింది.

కారులో రాజాగారున్నారు...

తనకూ సుభద్రకూ తీరిపోయినట్టు స్పష్టమయింది. ఇటీవల కొద్దికాలంనుంచీ



అతను తనకూ సుభద్రకూ సంబంధమున్నదనే సంగతి వ్యాప్తం అయితే బాగుండు నని కోరుకుంటూ వచ్చాడు. తారలతో సంబంధం ఉందనే అపఖ్యాతి కీర్తికన్న గొప్పది. సుభద్ర తార కాబోతున్నట్టు రామ్మూర్తి ఊహించుకోగలిగాడు. కాని ఈ సంఘటన జరిగినాక ఆ అపఖ్యాతి స్వయంగా వెప్పుకోసాగాడు అతనితో అయిదు నిమిషాలు మాట్లాడిన ప్రతివాడికి సుభద్రతో అతని సంబంధంగురించి తెలిసిరా సాగింది. రామ్మూర్తి భావించినట్టే ఇది కీర్తికింద జమకాసాగింది.

*　　　　*　　　　*

రాజాగారిదగ్గర చేరిన మొదటి అయిదారు వారాలూ అనుభవించిన నరకం రామ్మూర్తి ఆస్తిపోయిన తరవాతకూడా అనుభవించలేదు. తన స్థితి తలుచుకుంటే ఏడుపొచ్చేది తన కథానాయకపాత్రమైన సాహిత్యలోకమూ, నాటకలోకమూ మాయమైనై. సుభద్ర ఎడమైపోయింది. తన పరువు పూర్తిగా పోయింది. చేసేపనిలేదు.

"ఈ నరక కూపంలోనుంచి ఎట్లా పైకొస్తాను? ఏం పాపంచేసి నేనిందులో కొచ్చిపడ్డాను?" అని తనను తాను ఎన్నోసార్లు ప్రశ్నించుకున్నాడు. ఇదంతా

దేవుడు చేసిన ద్రోహంగా కనిపించేది. సుభద్రకుకూడా ఈ ద్రోహంలో దేవుడితో సమానభాగం ఉందని రామ్మూర్తి మనస్ఫూర్తిగా నమ్మాడు.

రామ్మూర్తి జీవితం చేసిన ఏ పరీక్షకూ తట్టుకోలేదు. అన్ని పరీక్షల్లోనూ సున్నా మార్కులు తెచ్చుకున్నాడు. అతను తన జీవితసమస్యని ఏనాడూ నేరుగా ఎదుర్కోలేదు. వాటిని తన కళాభిరుచితో ముడిపెడుతూ వచ్చాడు. అతను ఏ కళకూ కించిత్తు ఉపకారం చేసినవాడు కాలేదు. కళల విషయంలో తనకున్న సంస్కార భావాలమీద ఎన్నడూ నిలబడలేదు. పైగా వాటి పతనానికి తన సంస్కారాన్నికూడా బలిచేసి తద్వారా తన జీవితసమస్య సాధించుకున్నాడు. మంచోచెడో తన సంస్కారాన్ని నమ్మి అతను దానికోసం ఆత్మత్యాగం చేసుకోలేదు. అటువంటి ఆత్మత్యాగంలో మానవత్వం ఉండవచ్చుననేదికూడా రామ్మూర్తికి స్ఫురించలేదు.

రామ్మూర్తిని మనం జరిగినదానికి తప్పుపట్టం. అతనుచేసిన పన్లతో మనకు పేచీలేదు. కాని అతను చెయ్యకపోయిన పని ఒకటుంది; ఏ రోజున అతను తాను త్యాగంచేస్తున్న సంస్కారాన్నిగురించి తాత్వికంగా ఆలోచించటానికి గట్టి ప్రయత్నం చేసినా సంఘంలో కలిగే మార్పులాలూకు తత్వం అతనికి బోధపడి ఉండును. కళలు ప్రజల అధీనంలోకి పోతూవుండటం అతను గమనించాడు. అది తప్పని నమ్మాడు. నమ్మినవాడు వాటికి ఎడంగానూ ఉండలేదు; ఈ మార్పు తప్పనిసరి అని తెలుసుకుని ఈ మార్పులోనుంచి సాధ్యమైనంత ఉన్నతాదర్శం సాధించి ప్రజలకు అత్యధికమైన మేలు కళలద్వారా సాధించే ఉద్యమం నిర్మించటానికి ప్రయత్నం చెయ్యనూలేదు. తా నేదైతే కళాపతనం అని నమ్మాడో దాన్నే ఆశ్రయించి స్వార్థం గడుపుకున్నాడు.

దీనికికూడా రామ్మూర్తిని మనం తప్పుపట్టలేం. అతనికి కళాసృష్టి చేసే ప్రతిభ లేదు. సాంఘిక వ్యవస్థలోనూ కళలలోనూ కలిగే పరిణామాన్ని తాత్వికంగా అవగాహన చేసుకునే విజ్ఞానమూ అతనికి లేవు. ఈ రెండూలేని మధ్యతరగతి సంస్కారి ఏ విధంగా ప్రవర్తించాలో రామ్మూర్తి ఆ విధంగానే ప్రవర్తించాడు. అతని స్థితిలో అతనివంటివాడు మరొకడు మరోవిధంగా ప్రవర్తించి ఉంటాడనుకో నవసరంలేదు.

జమీందారు సుభద్ర ఇంటోనుంచి రావటం చూసిననాటినుంచీ రామ్మూర్తి మనో వేదన క్రమంగా తగ్గసాగింది

మొదటి నెలాపదిహేనురోజులూ తానుపడ్డ బాధనుగురించి ఈగకైనా తెలియ నివ్వలేదు. 'ఇవి నాకు చెడురోజులు. ఇంతకంటె చెడురోజులు వచ్చిపోలేదా? ఓపిక

పట్టి ఉంచే దేవుడు నన్నిందులోనుంచి బయట పడెయ్యకపోడు,' అనుకున్నాడతను. తనని కనిపెట్టి ఉండటం భగవంతుడి విధ్యుక్తధర్మాలలో ఒకటని రామ్మూర్తి దృఢ విశ్వాసం.

అయితే, వెనకటికి చెప్పిన కథలో పిడతంభొట్ల జోస్యంలాగా, రామ్మూర్తి విశ్వాసం మరోసారి రుజువయింది. ఓనాటి ఉదయం రామబ్రహ్మంగారు పిలుస్తున్నారని రామ్మూర్తికి కబురువచ్చింది. తనకీ కబురు పట్టుకొచ్చినవాణ్ణి కారులో ఎక్కించుకుని రామబ్రహ్మంగారి దగ్గరికి పరిగెత్తాడు రామ్మూర్తి.

'ఏం బ్రదర్, మా స్నేహితుడొకాయన పిక్చరు తీస్తానంటున్నాడే. నువ్వేమో రాజాగారిదగ్గరే యిరుక్కుపోయినావాయెను, నాకు వేరే లక్షపనులున్నై...ఏమన్నా మా వాడికి తోడుపడగలవా ?' అని అడిగాడు రామబ్రహ్మం.

మరో వారం రోజుల్లోపల అంతా స్థిరమయింది. కథా, సంభాషణలూ, పాటలూ, పద్యాలూ రాయటానికి కొత్తకంపెనీవారికి మాటిచ్చి, ప్రజామిత్రకొక కథకూడా ఇవ్వటానికి ఒప్పుకుని రామ్మూర్తి ఒకనాటి సాయంకాలం నేరుగా ఆచారప్పన్ వీధి నుంచి రాజాగారి బంగళాకి వెళ్ళి తన రాజీనామా ఇచ్చుకున్నాడు. రాజాగారు రామ్మూర్తి రాజీనామాను చాలా సుహృద్భావంతో స్వీకరించారు. ఆయన ఫిలిమ్ తీసే ప్రయత్నాలు ఏమాత్రమూ సుముఖంగా లేవు. మనుషులందర్నీ పంపేస్తున్నారట. అటువంటి సందర్భంలో రామ్మూర్తికి మూడునెల్ల జీతంకూడా ఇచ్చి పంపటంలో రాజాగారు చాలా ఔదార్యం ప్రకటించారనే చెప్పాలి. ఆయన్నుగురించి అనేక అపోహలు పడ్డందుకు రామ్మూర్తి చాలా నొచ్చుకుంటూ సవినయంగా శలవు పుచ్చుకున్నాడు.

రామ్మూర్తి కొత్తకంపెనీకి కథ రాశాడు. కంపెనీ డైరెక్టర్లు కొందరు కథను ఆమోదించలేక పోయినారు. వారందరి సలహాల ప్రకారం కథరాస్తే నాయకుడు సుగుణవంతుడూ, దుర్మార్గుడూ, దాతా, లోభీ, ఏకపత్నీవ్రతుడూ, జారుడూ, దేశభక్తుడూ, ఖద్దరు సూటుధారీ, అవివేకీ, దైవభక్తి పరాయణుడూ కావలసివచ్చింది. రామ్మూర్తి అన్నిటికీ సమ్మతించాడు. కథానాయికమటుకు పతిశీల, మహాసాధ్వి. ఆ విషయం డైరెక్టర్లూ, వారి బావమరుదులూ ఏకాభిప్రాయం ప్రకటించారు. ఆవిడకు చదువూ సంధ్యలు లేవు. భర్త కొట్టినా, తిట్టినా పడి ఉంటుంది. భర్త తనతో సరిగా ఉంటే ఉద్యానవనాల్లో పూలుకోస్తూ పాటలు పాడుతుంది, భర్తతో దాగుడుమూతలాడుతుంది. భర్త దుర్మార్గుడైపోగానే చింకి చీరెకట్టుకుని ఏడుస్తూ పాడుకుంటూ వీధులవెంట బయల్దేరుతుంది. దుర్మార్గుడై పొయ్యేమునుపే నాయకుడు దాతృత్వంలో

విచ్చలవిడిగా ఓలలాడుతూ, తనను వంచించబోయే వేశ్య కివ్వటానికిగాను ఇతరత్రా అప్పులు చెయ్యటంవల్ల, తీరా అతను దుర్మార్గుడై పొయ్యేసమయానికి చక్కగా నాయికకు తినేటందుకు తిండీ, కట్టేటందుకు బట్టాలేకుండా పోయింది. ఆవిడకు కట్టేటందుకు బట్టలేకపోవటం ఒక రసవత్తర సన్నివేశంగా చిత్రించమని ఒక 'బావమరిది' రామ్మూర్తిని స్వయంగా కోరాడు.

అన్ని పక్షాలవారూ కోరిన అంశాలన్నీ పెట్టి రామ్మూర్తి కథా, మాటలూ, పాటలూ యథోచితంగా తయారుచేసి స్క్రిప్టు పూర్తిచేసి తన డబ్బు పుచ్చుకుని బయటపడ్డాడు.

ఇప్పుడు రామ్మూర్తి సినిమామీద జోరుతో వ్యాసాలు రాయసాగాడు. 'మన చిత్రాలు బాగుపడాలంటే', 'టెంపో అంటే ఏమిటి?', 'దర్శకత్వంలో 'త్వం' మన్నా', 'సినిమా ఒక కళే', 'సినిమా ఒక పరిశ్రమ' మొదలైన గంభీర వ్యాసాలు ఆయా పత్రికల్లో ప్రకటించాడు.


అన్ని గండాలు గడిచి 'రామ్మూర్తి పిచ్చరు' బయటికొచ్చేసరికి నలుగురు విమర్శకులు దాన్ని 'పొట్టి తుక్కుచిత్ర'మని దీవించారు. వారి దీవనల మహత్యమో అన్నట్టు అది అన్ని సెంటర్లలోనూ అయిదారు రోజులు నడిచి నడిరోడ్డుమీద ఆగి ఊరుకుంది.

అయితే రామ్మూర్తి నెవరూ మళ్ళీ పిక్చర్లలో పెట్టుకోరనుకున్నవాళ్ళు చాలా పొరపాటుపడ్డారు. ఈ చిత్రం నడవలేదని తెలిసిన వారంరోజులకే మరెవరో వచ్చి రామ్మూర్తిని మరో చిత్రానికి స్క్రిప్టురైటరుగానూ, కవిగానూ, అసిస్టెంటు డైరెక్టరుగానూ బుక్ చేశారు. కాని దురదృష్టవశాత్తూ ఆ చిత్రం బయటికి రాలేదు.

ఈ పరిస్థితుల్లో యుద్ధం వచ్చింది.

* * *

యుద్ధ సంవత్సరాలు రామ్మూర్తికి చాలా హడావుడిగా గడిచినై. అప్పటికతను బాంకులో రెండువేలకు పైగా నిలవచేసి ఉంచాడు. అతనికిప్పుడు సినిమా ప్రపంచంలో కొత్త వ్యాపారం ఏర్పడింది. రాఫిలిం అందక ప్రొడ్యూసర్లు ఇరుకున పడసాగారు. కొడక్‌వారు ఫిలిం పంచి ఇస్తున్నారు. త్వరత్వరగా పిక్చర్లు పూర్తి చేసుకోదలిచినవారికి తగినంత ఫిలిం దొరకటంలేదు. రాఫిలిం తెచ్చే పడవలు మునిగినట్టుకూడా వార్తలు వచ్చినై. బొంబాయిలో ప్రొడ్యూసర్ల దగ్గర పెద్ద పెద్ద స్టాకులున్నట్టు తెలిసి రామ్మూర్తి మరొకర్ని వెంటబెట్టుకుని బొంబాయి వెళ్ళాడు. ఆ మరొకరు పెట్టుబడి పెట్టేవారు. కొందరు గుజరాతీ ప్రొడ్యూసర్లు వీరికి ఫిలిం



అమ్మారు. ఆ ఫిలిం తెచ్చి రామ్మూర్తి పట్నంలో ఒకరిద్దరు ప్రొడ్యూసర్లకు అంటగట్టాడు. మంచి లాభాలే వచ్చినై. రామ్మూర్తి అందులో సహం పుచ్చుకున్నాడు.

రాగితం కొని ఉంచితే మంచి లాభం వస్తుందని బొంబాయి వ్యాపారస్తులు రామ్మూర్తికి సలహా ఇచ్చారు. రామ్మూర్తి రాగితంకూడా ఓపిక ఉన్నంతవరకు తెచ్చి స్టాకుచేసి అట్టే పెట్టాడు. ఇది కాలక్రమాన లాభించింది.

కొందరి సహాయం తీసుకుని రామ్మూర్తి వారఫండు నాటకాలూ అవీ ఆడించే ఏర్పాట్లలో పాల్గొనసాగాడు. అందులోకూడా చాలా లాభం వచ్చింది.

మద్రాసులో ఆంధ్రమహాసభ రజతోత్సవమూ, నాట్యకళాపరిషత్తు సమావేశమూ, నవ్యసాహిత్య పరిషత్సమావేశమూ ఒకేసారి జరిగినై. ఈ సమావేశాలు జరిగినన్నాళ్ళూ రామ్మూర్తి మంచి పబ్లిసిటీ తెచ్చుకున్నాడు. అందరూ తనవాళ్ళే. నవ్యసాహిత్య పరిషత్సమావేశం చూడటం అతనికిదే మొదటిసారి. కాని అందరూ పాతస్నేహితులే. ఏవి సన్మానం జరుగుతూంటే రామ్మూర్తికి స్వయంగా సన్మానం జరిగినంత సంతోషం కలిగింది. ఈ సందర్భంలో అతను శ్రీ శ్రీ, ఇంద్రకంటి,

పిలకా మొదలైన యువకరచయితల పరిచయం చేసుకున్నాడు. వీళ్ళంతా ఏం రాస్తున్నదీ రామ్మూర్తికి బొత్తిగా తెలీదు, కాని వీరంతా పెద్దకవులకంటె తక్కువ తరగతివాళ్ళనిమటుకు అతనికి నమ్మకంగా తెలుసును.

ఈ సభలనుంచి ఒక నాడు ట్రామెక్కి ఇంటికి తిరిగి వస్తుండగా తన పక్కన కూర్చున్నవాళ్ళు ఏదో చర్చించుకుంటూండటం విన్నాడు. అందులో ఒకడు అర్థం లేని పద్యాలు చదవటం విని రామ్మూర్తి నిర్ఘాంతపోయినాడు. 'కాకికేమి తెలుసు సైకో ఎనాలిసిస్...ఆటవెలది ద్విపద కర్తగారు...అయిదు రెండు మూడు ఆముక్తమాల్యద.' మరోడు అందించుకున్నాడు, 'చలంగారి పాపం, ప్రజామిత్రకోపం, జరుక్ నాథ జాంబక్, మిణీశాస్త్రి హంబక్.' మొదటివాడు తిరిగి అందుకున్నాడు. 'చీకటిలో నా గదిలో నా గదిలో చీకటిలో, చీకటిలో నా గదిలో చీకటిలో...'

'వీళ్ళకేమైనా మతిపోయిందా?' అనుకున్నాడు రామ్మూర్తి.

'నన్నడిగితే ఈ సైకిక్ ఆటోమాటిజం అనేది హంబగ్. మనస్సు తన్ను తాను పరీక్షించుకునే ప్రయత్నంలో తన్ను తాను మార్చుకుంటుంది కూడా!'

'సర్రియలిజంలో మనస్సు తన్ను తాను పరీక్షించుకోవటం ఉండదు. మనస్సు ఇన్‌హిబిట్ అవుతుంది...ఫ్రాయిడ్...పాకెల్యార్డు...పికాసో...'

ఈ జరుగుతున్నది సాహిత్య చర్చగాని, కళాచర్చగాని అయి ఉంటుందని అతనికి ఏ మాత్రమూ అనుమానం పోలేదు.

'మనకు ప్రోలిటేరియన్ లిటరేచరు కావాలి. ఆర్టు ప్రజల దగ్గరికి పోవాలి.'

'ఆమాట నాన్సెన్స్. ప్రోలిటేరియన్ ఆర్టనేది కాంట్రడిక్షన్ ఇన్ టర్మ్స్. తెల్లని చీకటి అన్నట్టు. ప్రోలిటేరియన్ ఆర్టు కావలిస్తే తోలు బొమ్మలు చూడు. నాడియా పిక్చర్లు చూడు. ఏముంది వాటిల్లో? ప్రోలిటేరియటును ఆర్టుకు దగ్గరగా తీసుకురావాలి—'

'మనదేశంలో అసలు ప్రోలిటేరియటెక్కడ?'

'ప్రోలిటేరియన్ ఆర్టంటే ఫార్సా, కంటెంటా? తోలుబొమ్మలే తీసుకుని ప్రజల కుపకరించే విషయాలు ఆర్టుతో కలిపి చెప్పవచ్చు—'

'అది ప్రాపగాండా! కళ ఎప్పుడూ ఉన్నత శిఖరాల్లోనే ఉంటుంది. అది ఎప్పుడూ కొరివిమందికే.'

'ఆర్టు ఉన్నత శిఖరాల్లో ఏమీ ఉండదు. అది మనం ఏ గడ్డి తినమంటే ఆ గడ్డి తింటుంది. గోపెల్సు ప్రాపగాండాలో కూడా ఆర్టున్నది. టాల్‌స్టాయి కథల్లోకూడా ప్రాపగాండా ఉంది. జనసామాన్యానికి ఉపకరించే ఆర్టును ప్రచారమని బూర్జువా జీవి ఎప్పుడూ ఏడుస్తుంది. కాంట్ హెల్పిట్!'

'జనసామాన్యానికి చదువు రాదు.'

'చదివించుకుంటార్లే.'

కుర్రకారు వాళ్ళు ఇటువంటి చర్చలు చేస్తూ ఉండటం రామ్మూర్తికి ఆశ్చర్యమూ అసహ్యమూకూడా కలిగింది. అతను సాహిత్యం జోలికిపోయి చాలాకాలమైనప్పటికీ తెలుగుసాహిత్యానికి సన్నిహితులలో తానుకూడా ఒకడనే విశ్వాసం అతనికి లేకపోలేదు. ఇటువంటి అభిప్రాయాలుగల కుర్రాళ్ళ ఆటలు సాగనిస్తే ఇక సాహిత్యం గతి అధోగతేననుకున్నాడు రామ్మూర్తి.

'అసలు కళ అంటే ఏమిటి ?' అన్నాడొక కుర్రాడు.

'ప్రేక్షకుడి మీదా పాఠకుడిమీదా శాశ్వతమైన ప్రభావం కలిగించే శక్తి. కళ శాశ్వతంగా ఉండాలి.'

'నాన్సెన్స్ ! శాశ్వతంగా ఉండే కళా వస్తువులేదు. ఎప్పటికైనా ప్రతిదీ చావవలసిందే.'

'శాశ్వతమంటే నేనో నిర్వచనం చెబుతాను. దాని ప్రయోజనం అయిపోయినా కూడా నిలబడ్డ కళ శాశ్వతమే.'

'శాశ్వతంగా నిలబడే పుస్తకాలు నూటికీ కోటికీ ఒకటి ఉండవు.'

'అదే కళాయుతమైన సాహిత్యం.'

ఈ విధంగా చర్చరేగిపోతున్నది. రామ్మూర్తి ఈ "పెద్దమాటలు" మాట్లాడే వాళ్ళకేసి, తప్పనిసరి అన్నట్టు ఒక్కసారి తిరిగి చూశాడు. అంతా అర్భకులు. వాళ్ళ గొడవ వినటం మానేసి తన దగ్గర ఉన్న కాగితం వెంటనే అమ్మటమా లేక మరి కొంచెం ధరవచ్చేవరకూ ఉంచటమా అనే సమస్యగురించి ఆలోచించసాగాడు.

ఆ తరవాత కొద్ది రోజుల్లోనే మద్రాసు ఖాళీ కాసాగింది. జపానువాళ్ళు ఎప్పటికైనా వచ్చి తీరుతారనీ, ఏ రోజున వచ్చినా రావచ్చుననీ, వచ్చి సముద్రంలో కనిపెట్టుకున్నారనీ రకరకాల వార్తలు పట్నమంతటా వ్యాపించినై. మద్రాసుపౌరులు జపాను విముఖత్వం ప్రకటించటానికన్నట్టు తండోపతండాలుగా పట్నం ఖాళీచేసి పోసాగారు. రామ్మూర్తి తన ప్రతినిధిగా భార్యను పుట్టింటికి పంపేశాడు. ఆవిడ మళ్ళీ కడుపుతో ఉంది.

మళ్ళీ రామ్మూర్తి జీవితం వ్యాపారంలో పడిపోయింది. నానాటికీ లాభసాటి వ్యాపారాని కవకాశాలు హెచ్చుతున్నై. అతని కారు రెండువేలకు అమ్ముడుపోయింది.

యుద్ధ ప్రయత్నం ధర్మమా అంటూ ప్రజల సంపాదనలు హెచ్చిపోతున్నై.

యుద్ధకారణంగా దిగుమతులు కట్టయి పోయినై. డబ్బు అతివృష్టి అయిపోయింది. ప్రతివస్తువుధరా తాటిపాము కొటులాగా నానాటికీ హెచ్చిపోయున్నది.

“యుద్ధం అయేవరకూ ధరలు హెచ్చుతూనే ఉంటై. యుద్ధం ఇప్పుడప్పుడే కాదు. మేం ఎంత ధరపెట్టి అయినాసరే బంగారం కొనేస్తున్నాం,” అని బొంబాయిలో ఉన్న మార్వాడీ స్నేహితుడొకడు రామ్మూర్తికి సలహా ఇచ్చాడు. అతని సలహా మీదనే రామ్మూర్తి మందులుకూడా విరివిగా కొని దాచాడు. లోహసామగ్రికూడా విచ్చలవిడిగా కొని అమ్మసాగాడు రామ్మూర్తి.

అతని సంపద ఎంత హెచ్చిపోతున్నా అతను బాంకులో కానీ ఉంచలేదు. అంతా వస్తువులమీదనే ఉండనిచ్చాడు. అతని కాలం యావత్తూ బొంబాయి మద్రాసుల మధ్య తిరగటంతోటే సరిపోతున్నది.


రామ్మూర్తి ఇన్ని రకాల మనుష్యులతో తిరిగినా బొంబాయి వ్యాపారస్తుల సంపర్కంవల్ల అతనికి కలిగిన ఆనందం మరెవరి ద్వారాకూడా అతనికి లభించలేదు. చమన్‌లాల్, మాణిక్‌లాల్, ఫూల్‌చంద్, ఉమచంద్, బాపట్‌లాల్, భోపట్‌లాల్ వగైరా వ్యాపారస్తుల్నీ, వాళ్ళు చేసే కళ్ళుతిరిగే వ్యాపారాన్నీ తలుచుకుంటేనే రామ్మూర్తి కొక విధమైన పారవశ్యం కలిగేది. డబ్బుచేత గుడ్లు పెట్టించేవాళ్ళే నిజంగా సార్థకజన్ములు. అసమర్థులంతా కళల్ని గురించీ, సాహిత్యం గురించీ కాలం వృధాచేస్తుంటే ఈ మహానుభావులు లోకాన్ని కుమ్మరి సారె మీద పెట్టి గిర గిరా తిప్పేస్తున్నారు. అయిదుపందలూ, వెయ్యీ చూసి అదికూడా డబ్బే అనుకున్న రోజులు తలుచుకుని రామ్మూర్తి సిగ్గుపడ్డాడు. బొంబాయిలో గడ్డివ్యాపారం చేసి లక్షలు గడించేవాళ్ళూ, పాలవ్యాపారంచేసి కోట్లు గడించేవాళ్ళూ ఉన్నారు.

బెంగాల్లో కరువొచ్చింది. ప్రజలు వేలసంఖ్యలో చస్తున్నారు. రాయలసీమలో కరువొచ్చింది, ఒరిస్సాలో కరువొచ్చింది, మలబారులో కరువొచ్చింది. దేశద్రోహులు, “దొంగవ్యాపార్లు, దొంగవ్యాపార్లని” అలజడి చేస్తున్నారు.

కంట్రోలులూ అవీ తీవ్రం కాసాగినై. ఈ దిక్కుమాలిన దేశంలో ఈ వెధవ యుద్ధం మూలంగా స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే ఆస్కారం కూడా పోయింది. చాటుచాటుగా రామ్మూర్తి కాగితమూ, మందులూ, గుడ్డా అయినకాడికి వొదిలించుకోసాగాడు.

యుద్ధం అయిపోయేసరికి రామ్మూర్తి పాతికవేలు డబ్బు చేసుకున్నాడు గాని ఆదాయప్పన్ను కానీ యిచ్చిన పాపాన పోలేదు. డబ్బంతా దగ్గరే ఉంచుకున్నాడు.

అదివరకెన్నడూ రాజకీయాలలో ఆసక్తి ప్రకటించని రామ్మూర్తి యుద్ధం




అయిపోయ్యేనాటికి రాజకీయాలనుగురించి శ్రద్ధ కనబరచసాగాడు. గడచిన జాతీయ స్వాతంత్ర్యోద్యమాలన్నీ ఇప్పుడతనికి సువర్ణాక్షరాలతో లిఖించదగిన చరిత్రగా కనబడసాగింది. దేశీయ నాయకులూ, ఆంధ్ర నాయకులూకూడా అతని కళ్ళకి ఉన్నతంగా కనపడసాగారు. ఈ విషయం తనకు పూర్వం ఎందుకు తెలిసిరాలేదో అతనికి అర్థంకాలేదు. దానికి ఒకటే కారణం కనపడింది. ఆ ఉద్యమాలు ఏదో రూపంలో సఫలత పొందుతున్నాయనీ, దేశాన్ని దాస్యంలో ఉంచిన బ్రిటిషువారికెక్కడో తగులుతున్నాయనీ అతనికప్పట్లో నమ్మకం లేకపోయింది. కాని 1942 ఆగస్టులో అకస్మాత్తుగా రామ్మూర్తికి కనువిప్పయింది. కాంగ్రెసులో ఎంత ప్రబల శక్తి ఉంటేనేగాని ప్రభుత్వం ఉమ్మడిగా అంత మందినీ అరెస్టుచేసి ఉండదు... యుద్ధకాలంలో రామ్మూర్తి సంపాదించిన కొత్త స్నేహితుల్లో కాంగ్రెసుపై విశ్వాసం, కాంగ్రెసులో పరిపూర్ణమైన నమ్మకం లేనివాడు లేడు.

అయితే రామ్మూర్తిలో కలిగిన యీ రాజకీయ చైతన్యం ఒక్కసారిగా అతనికి రాజకీయ విజ్ఞానాన్ని కలిగించలేదు. కాంగ్రెసును విమర్శించే వారి కతను సమాధానాలు చెప్పలేకపోయ్యేవాడు. అటువంటి విమర్శలకు ఇవ్వదగిన సమాధానాలున్నప్పుడుకూడా అతనికవి తెలిసేవికావు. మరెవరన్నా ఆ సమాధానా లిస్తు

న్నప్పుడు రామ్మూర్తి, తనకుకూడా ఆపాటి రాజకీయ పరిజ్ఞానం లేకపోయినందుకు, చాలా చింతించేవాడు.

ఎవరుపడితే వాళ్ళు, హైక్సలోనూ, ట్రాముల్లోనూ, పార్కుల్లోనూ, బీచిలోనూ, ఇళ్ళలోనూకూడా రాజకీయాలు మాట్లాడుకోవటం ఒక విధంగా అతనికి రుచించేది కాదు. ఈ చర్చలవల్ల అతని రాజకీయ పరిజ్ఞానం పెంపొందకపోగా అతని రాజకీయ విశ్వాసాలు బలహీనమవుతూ ఉండేవి...ఒక నాడతను ఒక అతి విచిత్రమైన సంభాషణ వినటం తటస్థించింది. ఇద్దరు ప్రఖ్యాత కాంగ్రెసువాదులు గాంధీనీ, జవహర్లాలునూకూడా తీవ్రంగా విమర్శించటం విన్నాడు.

మరో సందర్భంలో ఒక కమ్యూనిస్టూ ఒక రాయిస్టూ చర్చించుకుంటుండగా విన్నాడు.

"మీ కమ్యూనిస్టులు నశిస్తేగాని రాజకీయాలు బాగుపడవు. ఇంటర్నేషనల్ తీసి పారెయ్యటంలో స్టాలిన్ చాలా మంచిపని చేశాడు. ఇక మీ రాజకీయాలకు స్టాలిన్ బాధ్యుడుకాడు. మీ కిప్పు డెవరు దిక్కు? యుద్ధం ప్రారంభంకాగానే, ఖచ్చితంగా 'ఇది ఫాసిస్టు వ్యతిరేక యుద్ధం. ఇంతటితో సామ్రాజ్యవాదం నడుము విరుగుతుంది. ఇందులో మనం పాల్గొనవచ్చు.' నని రాయి ఘంటాపథంగా చెప్పినప్పుడు మీరెక్కడున్నారు? మీ బ్రిటిషు కామ్రేడ్సును నమ్ముకుని యుద్ధవ్యతిరేక ప్రచారంచేశారు. హిట్లరు రష్యామీద పడ్డ ఆరు నెల్లదాకా మీకేం జరుగుతున్నదీ తెలీదు," అన్నాడు రాయిస్టు.

"మేం ఆలస్యంగా మేలుకున్నామేమో? అండర్ గ్రౌండులో ఉన్నాం. కాని మా కంటే ముందు మేలుకొని మీరేం చేశారు? ప్రభుత్వం డబ్బుతో యుద్ధ ప్రయత్నం సాగించారేగాని, శ్రామికులను కూడగట్టటానికి తగిన ప్రయత్నం ఏం చేశారు? అసలు మీకు కబుర్లు చెప్పటానికి తప్ప, పని చెయ్యటానికి ఓపిక ఎక్కడుంది?" అని కమ్యూనిస్టు చెప్పాడు.

వాళ్ళ చర్చ రామ్మూర్తి పొంతం వినలేదు. అతనికి అసహ్యం వేసింది. వీళ్ళంతా రాజకీయాలు మాట్లాడట మేమిటనిపించింది. ఒకప్పు డతనికి లీలా నాటక సమాజం ట్రూపును చూచి ఇటువంటి భావమే కలిగిందిగాని దాన్ని త్వరలో మార్చుకునే అవకాశంకూడా అతనికి దొరికింది. రాజకీయాల విషయంలో అటువంటి అవకాశం దొరకటానికి సదుపాయంలేదు. అందుచేత అతను రాజకీయ సిద్ధాంతాల జోలికి పోనేలేదు. రాజకీయాలు తనకు సరిపడవని రామ్మూర్తి త్వరలోనే తెలుసుకున్నాడు.

కాని అంత సులభంగా రాజకీయాలతో అతనికి రుణం తీరిపోలేదు. అభ్యుదయ రచయితల సంఘంవారి సమావేశం అతనికి జతపడింది. దాని విషయం ఆరా తీయగా అదంతా కమ్యూనిస్టుల ప్రత్యేక ఉద్యమమని ఎవరో అన్నారు. అయినా సభలకు వెళ్లాడు. ఈ ఉద్యమంలో తనకు పరిచితులైన పూర్వకవులు కొందరున్నట్టు తెలిసి ఆశ్చర్యపడ్డాడు. వీళ్ళంతా కమ్యూనిస్టుల వలలో ఎట్లా చిక్కారో అతని కర్థంకాలేదు. అభ్యుదయ రచయితలు జరిపిన వైజ్ఞానిక ప్రదర్శనాలు చూశాడు "ముందడుగు" నాటకం చూశాడు. అన్నీ ఆకర్షవంతంగానే ఉన్నై గాని అందులో ఉదాత్తత కనిపించలేదు. ఉదాత్తమైన కళ మనిషిని కదిలించరాదని రామ్మూర్తి కనిపించింది. ఆ విశ్వాసంలో అతనికి విశ్వాసం కుదిరింది. ఈ కళా ప్రదర్శనాలు తన జీవితాన్ని ఎక్కడా స్పృశించినట్టు రామ్మూర్తికి తోచలేదు. శిల్పంలోకూడా ఆట్టే సంస్కారంలేదు. అయితే ప్రేక్షకులు వీటిని ఆప్యాయంగా స్వీకరించటం అతనికి వింతగా కనపడింది. ప్రదర్శనాల్లో పాల్గొన్న వారంతా కమ్యూనిస్టులేనని తెలిసినతరువాత అతను వాటిని గురించి ఆలోచించటం మానేసి నిశ్చింతగా ఇంటికి వెళ్ళిపోయాడు.

*　　　　*　　　　*

ఇటీవల రామ్మూర్తికి పట్నంమీద విరక్తి పుట్టింది.

"సంఘానికి ఎన్నోవిధాల సేవ చెయ్యాలని ప్రయత్నం చేశాను. ఇక విసుగెత్తింది," అన్నా డతను భార్యతో. కల్యాణికూడా దానికి సమ్మతించింది. తన భర్త సంఘసేవ చెయ్యటంకోసం తన జీవితమంతా ధారపోశాడని ఆమె నమ్మింది.

"పత్రికలనీ, సినిమాలనీ, నాటకాలనీ, వ్యాపారమనీ, అబ్బ, ఏం తిరిగారు! రెండు రోజులు వరుసగా మీ రింటో వున్నట్టేలేదు. దేముడి దయవల్ల యింత తినేటందుకుంది గనక ఇహ ఫర్వాలేదు. మనం యీ పాడు పట్నం వదిలేసి యింటికి పోయి యింత ఆస్తి సంపాదించుకుని హాయిగా పడివుందాం పదండి!" అన్నది కల్యాణి.

కాని రామ్మూర్తి జీవిత సమస్య అంత సులభంగా తీరేదికాదు. అన్నివైపులా అతనికి సమస్యలే. రేపు పిల్ల పెళ్ళిచెయ్యాలి, కొడుక్కు చదువు చెప్పించాలి. పదిపన్నెం డెకరాలు పెట్టుకొని దానిమీద వచ్చేదాంతో సరిపుచ్చుకుంటూ హాయిగా కాలుమీద కాలేసుకోవటమనేది అసంభవం. వ్యాపారం చేసి విపరీతమైన లాభాలు తీసినవాడికి పొలంమీద పెట్టుబడి చెయ్యటమంటే చెరుకురసం పెండు నమిలినట్టుగా వుంది. పోనీ ఏదన్నా పత్రికం చేద్దామంటే సామాన్యపు పత్రికంసరళి అతనికి

తెలీదు. ఏ పరిశ్రమలో నన్నా షేర్లు కొందామంటే అలవాటులేక భయం. అదీకాక పట్నంలో వున్న ధనికు లందరిమధ్యా తిరుగుతూ, బొంబాయిలో ఉన్న సేట్లతో సహవాసం చేసేవాడు యివన్నీ వదిలించుకుని ఎక్కడో తన స్వగ్రామంలో అనామకులమధ్య ఉండటం ఎట్లా ?

ఎక్కడ చూసినా యూనియనులూ, సమ్మెలూనూ. పొగాకు పనివాళ్ళూ, ప్రెస్సులవాళ్ళూ, బళ్ళవాళ్ళూ, రైల్వేవాళ్ళూ, ట్రాములవాళ్ళూ, ఫాక్టరీవాళ్ళూ, పాకీవాళ్ళూ – ఒకళ్ళేమిటి ? అందరూ సమ్మెలు చెయ్యటమే.

జీవితం ఇంత దుర్భరం ఎందుకయింది ? 1930 వరకూ తను ఆప్యాయంగా అనుభవించిన శాంతి ఏమైపోయింది ? ఆ రోజుల్లో నాలుగయి దెకరాలుకూడా లేని తనతోటివాళ్ళనుభవించిన సుఖం ఇంత డబ్బున్నా తనకెందుకు దూరమయింది ? ఏదో ఒకటిచేసి తన పొట్ట పోసుకోవటానికి ఇప్పటికీ రామ్మూర్తి కభ్యంతరంలేదు– పని చెయ్యటమే కూలి అనుకున్నరోజులు విడిచేసి అతను చాలా దూరం వచ్చేశాడు. కాని అతని బాధ ఏమిటంటే ఏం చేసినా తనకు అపాయమే కలుగుతుందనే భయం అతన్ని వెంటాడుతున్నది.


ఎంతో కష్టపడి నాలుగురాళ్లు సంపాదించుకున్నాడు. దొంగవ్యాపారం చేసిన వాళ్ళని ఒకవంక "దేశద్రోహులూ" మరోవంక మహా నాయకులూకూడా తిడుతుంటే ఆ తిట్లన్నీ భరించి దిగమింగాడు. తాను చేసిన దొంగవ్యాపారంవల్ల ఎవరి కొంపా కూలలేదనీ, ఇతరులను దోచినవాళ్ళనే తానూ దోచాననీ సమర్థించుకున్నాడు. కాని ఈ డబ్బుతో ఏం చెయ్యాలో తెలీటంలేదు. ఎటుచూసినా కంట్రోళ్లూ, ఆర్డినెన్సులూనూ. యుద్ధం హడావుడికూడా తగ్గిపోవటంతో రామ్మూర్తికి కొంత పిరికితనం పట్టుకున్నది.

రామ్మూర్తి యీ సందిగ్ధావస్థలో ఎంతోకాలం వుండలేదు త్వరలోనే తనడబ్బుతో ఏదో పెట్టుబడి చేస్తాడు. తన లాభాల కడ్డంగా ఉన్న శక్తులతో పోట్లాడతాడు. తన స్థితిలోనే ఉన్న శక్తులతో చేతులు కలుపుతాడు. అతనికి కావలసిన శాంతి ఇక రాదు.

కొద్దిరోజుల క్రితం అతనిదగ్గరి కొక కుర్రాడొచ్చాడు. పాతికేళ్ళుంటై.

"మీ కలావాణి పాత సంచికలుంటే ఒకసారి చూడనిస్తారా ?" అన్నడా కుర్రాడు. అప్పుడత నేదో కథ ఒకటి రాశాట్ట, దాన్ని కాపీచేసుకోవటానికి వచ్చాడు.

రామ్మూర్తి అతన్ని కూచోబెట్టి ప్రసంగంతో దింపాడు. ఆ కుర్రాడు మాటల కోసం తడుముకుంటున్నట్టే మాట్లాడుతూ రామ్మూర్తి ఎత్తిన ప్రతి విషయమూ మాట్లాడాడు. కవిత్వమూ, పత్రికా సాహిత్యమూ, కళలూ, రాజకీయాలూ, ఆర్థిక సమస్యలూ, ప్రజా జీవితంలో ఆందోళనా, అశాంతీ మొదలయినవా టన్నిటిని గురించి రామ్మూర్తితో మాట్లాడాడు.



"మీ రెంతైనా చెప్పండి, జీవితం గురించి మనకి కొన్ని మూలసూత్రాలు తెలిస్తేగాని మనకి పై విషయా లంతుబట్టవు. విశ్వమానవాత్మ ఏకత్వసిద్ధికోసమే పాటుబడుతున్నది. కాని నిరోధకశక్తులు చాలాఉన్నై. సోషలిస్టులే వర్గకలహం ప్రారంభిస్తున్నారని కొందరంటారు అంతా వుత్తదే! వర్గ విభజనా, ఒకవర్గాన్ని మరోవర్గం అణగ దొక్కటమూ ఏనాడో ప్రారంభమయింది. అణగదొక్కబడకుండా చూచుకోవడానికి కిందివర్గం ప్రయత్నాలు సాగించగానే అప్పుడే వర్గవిభజన ప్రారంభమైనట్టు మాట్లాడతారు. "ఐక్యతా నినాదం ఫాసిస్టు నినాదం" అంటూ ఆ మధ్యని పత్రికల్లో రాశారు. సామ్యవాదం సూచించే ఐక్యతనూ, వర్గరాహిత్యాన్నీ అర్థం చేసుకున్నవాడికి ఐక్యత ఎప్పుడు

పోట్లాడి సాధించాలో ఎప్పుడు సౌమ్యంగా సాధించాలో బోధపడుతుంది. సంఘంలో అశాంతికి ఒకేఒక కారణం దోపిడీ. అదే లేనినాడు ఏ ప్రచారమూ అశాంతిని వ్యాప్తి చెయ్యలేదు. దోపిడి తరగతులవారీగా జరుగుతున్నది. జీవితసూత్రాన్ని చేతులోకి పట్టుకుని కదిలించలేక దానికి చిక్కుపోయినవాడు యీ పరిస్థితి నేమీ చెయ్యలేడు. కిందివాణ్ణి దోస్తాడు, పైవాడిచేత దోపిడి చేయించుకుంటాడు. వాడే కళలు సృష్టించినా, ఏ రాజకీయాల్లో పాల్గొన్నా, ఏ ఆర్థిక సమస్యల్నిగురించి మాట్లాడినా ప్రపంచానికి పిసరంతయినా ఉపయోగం లేదు జీవితసూత్రాన్ని చేతబట్టినవాడు దాన్ని మరింత చిక్కుపరుస్తాడో, చిక్కు విడదీస్తాడో అది వాడి ఆదర్శాలనిబట్టి ఉంటుంది. వాడు మంచికి పనిచేస్తే వాడివల్ల లోకానికి ఉపకారం ఉంది, చెడుకు పనిచేస్తే అపకారం ఉంది. వాడి సాంఘిక చైతన్యం గురించీ, వాడి రాజకీయాలను గురించీ, వాడు సృష్టించే కళల్ని గురించీ, ఉదాసీనంగా ఉండటం బుద్ధిమంతుడి లక్షణం కాదు..."

ఆ కుర్రాడు యుద్ధం గురించీ, భారతదేశపు పెట్టుబడిదార్లు చేసిన యుద్ధ సహాయంగురించీ, దాని మూలంగా ఏర్పడిన రూపాయి కాగితాల అతివృష్టి గురించీ దానిని ఆధారం చేసుకుని దొంగ వ్యాపారస్తులు చేసిన సాంఘిక ద్రోహం గురించీ, చెప్పాడు. రష్యాను గురించికూడా చెప్పాడు. రామ్మూర్తికి కొన్ని పుస్తకాల జాబితా ఇచ్చి, "ఈ పుస్తకాలు తెప్పించుకుని చదవండి. వాటిలో వున్నది కేవలమూ వేద వాక్యమని నమ్మి లేనిపోని ఆవేశాలుకూడా తెచ్చుకోనవసరంలేదు. అందులో సత్యమేదో, అసమగ్రంగా ఉన్న సత్యమేదో క్రమంగా మీకే బోధపడుతుంది. ఈనాటి ప్రపంచాన్ని గురించి తెలుసుకోవటం సులభంకాదు. దానికి తగ్గట్టే అసత్య ప్రచారం చాలా జరుగుతున్నది. "పురుషులందు పుణ్య పురుషులు వేరయా" అన్నట్టు చప్పున చూడగానే సత్యమూ అసత్యమూ పైకి ఓలాగే కనిపిస్తాయి. ఓ పిసరు అసత్యమే బాగున్నట్టుకూడా కనిపిస్తుంది. అంచేత జీవితంగురించి కొంతకాలం ఊహించటం మానండి," అని సలహా ఇచ్చాడు.

రామ్మూర్తి ప్రస్తుతం యీ గ్రంథాలను చదవటంలో నిమగ్నుడై ఉన్నాడు. ఇవన్నీ చదివి అతనికి ప్రపంచంగురించి నిజం తెలిసినకొద్దీ అతని అశాంతి హెచ్చుతుందిగాని తగ్గదు. కాని ఆ అశాంతిలోనుంచి ఏదైనా పైకిరావచ్చు. జీవిత సూత్రం అతని చేతికి చిక్కాలేగాని అతను దాన్ని కదిలించటానికి ఏ ప్రయత్నం చేసినా చెయ్యవచ్చు సాహిత్య ప్రపంచంలోనూ, నాటక ప్రపంచంలోనూ అతను సంపాదించుకున్న పేరు సంఘాని కెప్పటికయినా నిజంగా ఉపకరించవచ్చు.